Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

RAJADHANI VARTALU




అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue) : 320 పేజీలు (Pages) : 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

శుక్రవారం, 7 - 8 - 2026

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com NI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

## రాష్ట్రంలో చిన్న పత్రికల సమస్యల పరిష్కారానికి కృషి: డైరెక్టర్ విశ్వనాథన్



**అమరావతి, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలోని చిన్న పత్రికలు పీరి యాడికల్స్ ఎదుర్కొంటున్న సమస్యల గురించి సమాచార శాఖ డైరెక్టర్ సానుకూలంగా స్పందించారు. ఆంధ్రప్రదేశ్ మధ్యతరహా చిన్న దినపత్రికలు పీరియాడికల్ జర్నలిస్ట్ అసోసియేషన్ ప్రతినిధులు ఆయనను కలిసి తమ సమస్యలను వివరించారు. చిన్న పత్రికలు పీరియాడికల్స్ విస్తరణకు, సదుపాయాల కల్పనకు ఉపయోగపడే రీతిలో ఒక కార్పొరేషన్ ఏర్పాటు చేయడం అవసరమని వివరించారు. రాష్ట్రం ఉమ్మడిగా ఉన్న సమయంలోనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిన్న పత్రికలకు 30 శాతం ప్రకటనలు ఇవ్వాలని చెప్పిన విషయాన్ని ప్రస్తావించారు. పత్రికల రెగ్యులారిటీకి జాతీయ స్థాయిలో సమాచార శాఖ అనుసరిస్తున్న పద్ధతిని పాటించాలని కోరారు. వీఐపీలు, ప్రముఖ వ్యక్తులు పర్యటనలకు విచ్చేసిన సందర్భంలో, ప్రధాన సంఘటనలు జరిగిన సందర్భంలో చిన్న పత్రికల జర్నలిస్టులకు వార్తల కవరేజీ విషయంలో తగిన ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. జర్నలిస్టులకు ప్రమాద బీమా సదుపాయం కల్పించాలని కోరారు. జర్నలిస్టుల సమస్యలపై వివరంగా తెలుసుకున్న డైరెక్టర్ ఆ సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించారు. సమాచార శాఖ డైరెక్టర్‌ను కలిసిన వారిలో ఆంధ్రప్రదేశ్ మధ్యతరహా చిన్న దినపత్రికలు పీరియాడికల్స్ జర్నలిస్టుల అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పి హుస్సేన్ ఖాన్, కే.కలిమిశ్రీలు ఉన్నారు.

## ఢిల్లీలో కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ నివాసంలో తెలుగు రాష్ట్రాల ఎన్డీఏ ప్రజాప్రతినిధుల ఆత్మీయ సమ్మేళనం

### - హాజరైన కేంద్ర మంత్రులు, ఎంపీలు, పలువురు ప్రజాప్రతినిధులు









**న్యూఢిల్లీ :** ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల సందర్భంగా ఢిల్లీలోని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ నివాసం వద్ద ఏర్పాటు చేసిన రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎన్డీఏ ప్రజాప్రతినిధుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల అభివృద్ధి, ప్రజా సమస్యల పై చర్చించారు. ఈ సమావేశంకు కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, గంగాపురం కిషన్ రెడ్డి, కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి సత్య కుమార్ యాదవ్ హాజరయ్యారు. అలాగే ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు, ఎంపీలు దగ్గుబాటి పురందరేశ్వరి, ఎం. శ్రీభరత్, గంటి హరీష్ మాధుర్, కేశినేని శివనాథ్, బైరెడ్డి శబరి, ఈటెల రాజేందర్, డీకే అరుణ, బీదా మస్తాన్ రావు (బీఎంఆర్), కలిశెట్టి అప్పలనాయుడు, పాక సత్యనారాయణ, భాష్యం రామకృష్ణ, సానా సతీష్ బాబు, చింతకాయల విజయ్, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు, సీనియర్ బీజేపీ నాయకులు బంగారు లక్ష్మణ్, అలాగే పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు కూడా ఈ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విచ్చేసిన కేంద్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులకు కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ ఆత్మీయ విందును ఏర్పాటు చేశారు. పార్లమెంట్ సమావేశాల బిజీ షెడ్యూల్ మధ్య రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎన్డీఏ ప్రజాప్రతినిధులందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చి ఈ ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించినందుకు భూపతిరాజు శ్రీనివాస వర్మను పలువురు నేతలు అభినందించారు. రాష్ట్రాల అభివృద్ధి, ప్రజా ప్రయోజనాల సాధన కోసం ఇలాంటి సమన్వయ సమావేశాలు భవిష్యత్తులో కూడా తరచుగా నిర్వహించాలని సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు ఆకాంక్షించారు.

## సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో ఆ పాఠశాలకు నూతన సొబగులు



**ఖమ్మం జిల్లా, (రాజధాని వార్తలు):** ఖమ్మం జిల్లాలోని గోపాలపురం పాఠశాలకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అండగా నిలబడ్డారు. ఆ పాఠశాల గదుల నిర్మాణానికి రూ.25 లక్షలు మంజూరు చేశారు. ఈ మేరకు కలెక్టర్‌కు తక్షణ చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో ఖమ్మం కలెక్టర్ దివాకర్ పాఠశాలను సందర్శించారు. ఉపాధ్యాయిని ఇందిరతో సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్ మాట్లాడారు. శిథిల భవనాల స్థానంలో కొత్త తరగతి గదులు నిర్మించాలని దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధికి కృషి చేసిన ఉపాధ్యాయినిని అధికారులు అభినందించారు. సీఎం ఆదేశాలతో వెంటనే నిధుల విడుదల చేశారు. ఈ నిధులతో గోపాలపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల అభివృద్ధి పథంలో కొనసాగనుంది.

## ఇరవై సూత్రాల కార్యక్రమాలు (వికసిత్ భారత్ - స్వర్ణ ఆంధ్రప్రదేశ్) అమలు : చైర్మెన్ లంకా దినకర్



**వెలగపూడి, (రాజధాని వార్తలు):** ఈరోజు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని రాష్ట్ర సచివాలయంలో ఇరవై సూత్రాల కార్యక్రమాలు (వికసిత్ భారత్ – స్వర్ణ ఆంధ్రప్రదేశ్) అమలు ఛైర్మెన్ లంకా దినకర్ మర్యాదపూర్వకంగా కలిసి, కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలుపై రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో రెండు దశలుగా నిర్వహించిన సమీక్ష సమావేశాల నివేదికను సమర్పించారు. అలాగే రాష్ట్రస్థాయిలో నిర్వహించిన వివిధ అంశాల సమీక్షలు, కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలును అధ్యయనం చేసేందుకు వివిధ రాష్ట్రాల్లో చేపట్టిన అధ్యయన పర్యటనల వివరాలను కూడా ముఖ్యమంత్రికి అందజేశారు. ఈ సందర్భంగా కొడుమూరు మరియు మదనపల్లి పర్యటనల్లో చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న వాస్తవ సమస్యలపై గతంలో తాను లేఖ ద్వారా చేసిన సూచనలను గుర్తు చేస్తూ, ముఖ్యమంత్రి వాటిని సంబంధిత శాఖలకు పరిశీలన కోసం పంపినందుకు లంకా దినకర్ కృతజ్ఞతలు తెలిపారు. చేనేత కార్మికుల ఆరోగ్య రక్షణ కోసం ప్రత్యేక చర్యలు, గృహ నిర్మాణ పథకాలలో స్థలానికి సంబంధించిన నిబంధనల్లో అవసరమైన వెసులుబాట్లు, స్వయం సహాయక సంఘాల తరహాలో సూక్ష్మ చేనేత గ్రూపుల ఏర్పాటు చేసి రివాల్వింగ్ ఫండ్ రుణ సదుపాయం కల్పించడం, టీటీడీ వంటి ప్రభుత్వ సంస్థల వస్త్రాల కొనుగోళ్లలో ఈ సూక్ష్మ గ్రూపులకు ప్రాధాన్యత ఇవ్వడం వంటి అంశాలను ముఖ్యమంత్రికి మరోసారి వివరించారు. రాష్ట్ర భవిష్యత్ నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని, దీర్ఘకాలిక నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు అదనపు సామర్థ్యంతో కొత్త రిజర్వాయర్ల నిర్మాణం, ఇప్పటికే ఉన్న రిజర్వాయర్లలో పూడిక తొలగింపు (డీసిల్టింగ్) కార్యక్రమాలను జాతీయ స్థాయి మిషన్‌గా చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వంతో చర్చించాలని ముఖ్యమంత్రికి లంకా దినకర్ సూచించారు. అలాగే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతిపాదించిన తూర్పు మరియు పశ్చిమ భారత దేశాన్ని రహదారి, రైల్వే, జలమార్గాల ద్వారా అనుసంధానించే సమగ్ర మౌలిక సదుపాయాల ప్రణాళిక దేశ ఆర్థికాభివృద్ధికి కొత్త దిశను చూపుతుందని లంకా దినకర్ పేర్కొన్నారు. ఈ ప్రతిపాదన ద్వారా విశాఖపట్నం–ముంబై మధ్య పారిశ్రామిక, వాణిజ్య అనుసంధానం బలోపేతమై, స్వర్ణ ఆంధ్రప్రదేశ్ లక్ష్య సాధనకు, అలాగే ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ సంకల్పించిన వికసిత్ భారత్–2047 దిశగా కీలకమైన ముందడుగు పడుతుందని ఆయన అన్నారు. ఇప్పటికే ఢిల్లీ–ముంబై ఎక్స్‌ప్రెస్‌వే దేశ ఆర్థిక ప్రగతికి బలమైన పునాది వేస్తోందని, అలాగే రాయలసీమ మీదుగా నిర్మాణంలో ఉన్న సూరత్–చెన్నై ఎక్స్‌ప్రెస్‌వే పూర్తయిన తర్వాత ఢిల్లీ నుంచి చెన్నై వరకు ఉత్తర, దక్షిణ భారతదేశాల మధ్య వేగవంతమైన అనుసంధానం ఏర్పడుతుందని లంకా దినకర్ తెలిపారు. అదే స్ఫూర్తితో ముఖ్యమంత్రి ప్రతిపాదించిన తూర్పు–పశ్చిమ భారత అనుసంధాన ప్రణాళిక దేశవ్యాప్తంగా సమతుల్య పారిశ్రామికాభివృద్ధికి, రవాణా సామర్థ్య పెంపుకు, పెట్టుబడుల ఆకర్షణకు మరియు ఉపాధి అవకాశాల విస్తరణకు దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు.



# క్యాబినెట్ సమావేశంలో పలు అంశాలపై తీసుకున్న నిర్ణయాలు

**అమరావతి, (రాజధాని వార్తలు):** తే.06-08-2026 దీ గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో జరిగిన 1391వ (54వ) క్యాబినెట్ సమావేశంలో పలు అంశాలపై తీసుకున్న నిర్ణయాలను రాష్ట్ర సచివాలయం నాల్గవ భవనం ప్రచార విభాగంలో రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖామాత్యులు కొలుసు పార్థసారధి మీడియాకు వివరించారు.

1. పురపాలక & పట్టణాభివృద్ధి శాఖ:
విశాఖపట్నం ఎకనామిక్ రీజియన్ కార్యక్రమం కింద GVMC పరిధిలోని జోన్-5, వార్డు నెం.35లో ఉన్న వెలంపేట మురికివాడ పునరాభివృద్ధిని డిజైన్, బిల్డ్, ఫైనాన్స్ అండ్ ట్రాన్స్‌ఫర్ పద్ధతిలో చేపట్టేందుకు GVMC కమిషనర్‌కు అనుమతి ఇచ్చే ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. GVMC యాజమాన్యంలోని 1,986.45 చ.మీ. స్థలంలో ప్రస్తుతం నివసిస్తున్న 177 EWS కుటుంబాలకు అక్కడికక్కడే పునరావాసం కల్పించేందుకు షేర్‌వాల్ టెక్నాలజీతో స్టిల్ట్ + 12 అంతస్తుల భవనం నిర్మించనున్నారు. PPP/DBFT విధానంలో 24 నెలల్లో ప్రాజెక్ట్ పూర్తి చేయడంతో పాటు, TDR ద్వారా రూ.17.07 కోట్ల నిధుల కొరతను భర్తీ చేస్తారు. ఈ ప్రాజెక్టును VER కార్యక్రమం కింద ఇతర మురికివాడల పునరావాసానికి పైలట్ ప్రాజెక్టుగా అమలు చేయనున్నారు.

2. పురపాలక & పట్టణాభివృద్ధి శాఖ:
ఆంధ్రప్రదేశ్ పెడెస్ట్రియన్ (పాదాచారులు) సేఫ్టీ అండ్ యునివర్సల్ ఆక్సెస్సిబిలిటీ పాలసీ-2026ను, దాని ఆపరేషనల్ మార్గదర్శకాలను ఆమోదించే ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ఈ పాలసీ ప్రకారం పాదచారుల మరణాలను పూర్తిగా నివారించే లక్ష్యంతో జీరో టాలరెన్స్ విధానం అమలు చేసి, ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలను తొలగించి అవరోధరహిత, సురక్షిత పాదచారి మార్గాలను ఏర్పాటు చేయాలి. అన్ని పట్టణ రహదారులపై శాస్త్రీయ రోడ్ సేఫ్టీ ఆడిట్‌లు నిర్వహించి, గత 2-3 సంవత్సరాల ప్రమాద డేటా ఆధారంగా అధిక ప్రమాదాలు నమోదైన 15-20 బ్లాక్‌స్పాట్‌లు, కూడళ్లు, పాఠశాలలు మరియు అధిక పాదచారుల రద్దీ ప్రాంతాలకు ప్రాధాన్యత ఇస్తారు. IRC ప్రమాణాలకు అనుగుణంగా ఫుట్‌పాత్‌లు, క్రాసింగ్‌లు, సబ్‌వేలు, ఖీూదీలు, లైటింగ్ తదితరాలను భద్రతా పరంగా మెరుగుపర్చాలి. ఆక్రమణల నియంత్రణకు GIS మ్యాపింగ్, CCTV మరియు కెమెరా ఆధారిత పర్యవేక్షణ చేపట్టి, ఏడాదిలో కనీసం 20% రోడ్లను దశలవారీగా సర్వే చేసి, గుర్తించిన లోపాలను వేగంగా పరిష్కరించాలి. ప్రజల్లో రహదారి భద్రతపై అవగాహన పెంచేందుకు IEC ప్రచారాలు, సామాజిక పోలీసింగ్, RWAలు మరియు పౌరుల భాగస్వామ్యం ద్వారా ప్రవర్తనా మార్పును తీసుకురావాలి. అలాగే C&D వ్యర్థాలను శాస్త్రీయంగా రీసైకిల్ చేసి ఫుట్‌పాత్ టైల్స్, కర్బ్‌లు, బొల్లార్డులు, వీధి ఫర్నిచర్ వంటి మౌలిక వసతుల తయారీలో వినియోగించేలా రాష్ట్రస్థాయి సరఫరా వ్యవస్థను అభివృద్ధి చేయాలి. మౌలిక వసతుల వైఫల్యాలకు వ్యక్తిగత బాధ్యతను నిర్ధారించి, సెక్షన్ 198-A కింద అవసరమైన శిక్షలు, 1 లక్ష వరకు జరిమానాలు విధించేలా చర్యలు చేపట్టాలి.

3. న్యాయ & హోం శాఖ:
ఆంధ్రప్రదేశ్ దిశ బిల్లు - క్రిమినల్ లా (ఆంధ్రప్రదేశ్ సవరణ) బిల్లు, 2019ను ఉపసంహరించుకునేందుకు చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. మహిళలు మరియు చిన్నారులపై జరిగే నేరాలపై వేగవంతమైన దర్యాప్తు, విచారణ కోసం ఉద్దేశించిన "ఆంధ్రప్రదేశ్ దిశ బిల్లు - క్రిమినల్ లా (ఆంధ్రప్రదేశ్ సవరణ) బిల్లు, 2019"ను రాష్ట్రపతి ఆమోదం కోసం గతంలో పంపిన ఈ బిల్లును పరిశీలించిన కేంద్ర హోం మంత్రిత్వ శాఖ.. పలు నిబంధనలపై వివరణలు కోరడంతో పాటు, కేంద్ర ప్రభుత్వ శాఖల సూచనలు పొందుపరిచి కొత్త బిల్లును సమర్పించేలా ప్రస్తుత బిల్లును వెనక్కి తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. మరోవైపు, పాత ఐపీసీ మరియు సీఆర్‌పీసీ చట్టాల స్థానంలో కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన 'భారతీయ న్యాయ సంహిత-2023', 'భారతీయ నాగరిక్ సురక్షా సంహిత - 2023' చట్టాలు 01.07.2024 నుండి దేశవ్యాప్తంగా అమలులోకి వచ్చాయి. దిశ బిల్లు ద్వారా సాధించాలనుకున్న మహిళలు, చిన్నారుల రక్షణ లక్ష్యాలను, కఠిన చట్టపరమైన నిబంధనలను ఈ కొత్త కేంద్ర చట్టాలు ఇప్పటికే బలోపేతం చేశాయి. కేంద్ర హోం శాఖ సూచనలు, నూతన క్రిమినల్ చట్టాల అమలు నేపథ్యంలో దిశ బిల్లును ఉపసంహరించుకోవడమే సబబు అని రాష్ట్ర డీజీపీ మరియు న్యాయ శాఖ ఇచ్చిన స్పష్టమైన అభిప్రాయం మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఈ బిల్లును వెనక్కి తీసుకునే ప్రతిపాదనకు క్యాబినెట్ అధికారికంగా ఆమోద ముద్ర వేసింది.

4. ఇంధన శాఖ:
ఆక్వాకల్చర్ ఫామ్‌లకు యూనిట్‌కు రూ.1.50 చొప్పున ఇస్తున్న విద్యుత్ టారిఫ్ రాయితీను తే.01.06.2026 నుండి పొడిగించే ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయం వల్ల ఆక్వా రైతులకు దాదాపు రూ.1150 కోట్ల మేర విద్యుత్ రాయితీని అందించడం జరుగుతుంది.

5. ఇంధన శాఖ:
పారిశ్రామిక పార్కుల్లో విద్యుత్ మౌలిక సదుపాయాల కల్పనకు APIIC ఫెసిలిటేటర్‌గా మూలధన వ్యయాన్ని భరిస్తున్న పనులన్నింటికీ APTRANSCO/APDISCOMలు విధించే పర్యవేక్షణ ఛార్జీలను 2.5 శాతానికి తగ్గించేందుకు మరియు అభివృద్ధి ఛార్జీలను మినహాయించేందుకు చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

6. రెవెన్యూ (భూములు) శాఖ:
కండలేరు రిజర్వాయర్ నుండి శ్రీ సిటీలోని పారిశ్రామిక క్లస్టర్లకు నీటి సరఫరా కోసం DI నీటి పైప్‌లైన్ నిర్మాణానికి తిరుపతి జిల్లా రిజర్వ్ ఫారెస్టులో 1.76 హెక్టార్ల అటవీ భూమిని మళ్లించడం జరిగింది. దీనికి ప్రత్యామ్నాయంగా SPSR నెల్లూరు జిల్లా రాపూరు మండలం పంగిలి గ్రామంలో సర్వే నెం.1570లో ఉన్న 8.70 ఎకరాల ప్రభుత్వ భూమిని అటవీ శాఖకు




కేటాయించేందుకు వీలుగా, సాధారణ నిబంధనలకు లోబడి ZM, APIIC, నెల్లూరుకు బదిలీ చేసేందుకు రెవెన్యూ (భూములు) శాఖ చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

7. రెవెన్యూ (భూములు) శాఖ:
కుసుమ్ ఫీడర్ లెవల్ సోలరైజేషన్ పథకం కింద సోలార్ పవర్ ప్రాజెక్ట్ ఏర్పాటు కోసం కడప జిల్లా పోరుమామిళ్ల మండలం చెర్లోపల్లి గ్రామంలో 49.67 ఎకరాల భూమిని లీజు ప్రాతిపదికన NREDCAP వైస్ ఛైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్‌కు బదిలీ చేసేందుకు రెవెన్యూ (భూములు) శాఖ చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

8. రెవెన్యూ (భూములు) శాఖ:
కుసుమ్ ఫీడర్ లెవల్ సోలరైజేషన్ పథకం కింద సోలార్ పవర్ ప్రాజెక్ట్ ఏర్పాటు కోసం కడప జిల్లా వేముల (గ్రామం & మండలం)లో 51.37 ఎకరాల భూమిని లీజు ప్రాతిపదికన NREDCAP వైస్ ఛైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్‌కు బదిలీ చేసేందుకు రెవెన్యూ (భూములు) శాఖ చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

9. రెవెన్యూ (భూములు) శాఖ:
శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి మండలం కప్పలబండ గ్రామంలో 2.00 ఎకరాల భూమిని జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలో జిల్లా ఞూ కార్యాలయ నిర్మాణం కోసం లీజు ప్రాతిపదికన TDPకి బదిలీ చేసేందుకు రెవెన్యూ (భూములు) శాఖ చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

10. రెవెన్యూ (భూములు) శాఖ:
శ్రీ సత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం ఏదుల ముస్తూరు గ్రామంలో 19.56 ఎకరాల భూమిని ఎకరానికి రూ.30.00 లక్షల మార్కెట్ విలువ చెల్లింపుపై, SDR అందిన అనంతరం సాధారణ షరతులకు లోబడి APIICకి బదిలీ చేసేందుకు రెవెన్యూ (భూములు) శాఖ చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

11. రెవెన్యూ (భూములు) శాఖ:
అన్నమయ్య జిల్లా మదనపల్లె మండలం వలసపల్లె గ్రామంలో 2.00 ఎకరాల భూమిని జిల్లా కేంద్రంలో జిల్లా TDP కార్యాలయ నిర్మాణం కోసం లీజు ప్రాతిపదికన TDPకి బదిలీ చేసేందుకు రెవెన్యూ (భూములు) శాఖ చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

12. రెవెన్యూ (భూములు) శాఖ:
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం (గ్రామం & మండలం) నదిపూడి గ్రామ పంచాయతీలో 2.00 ఎకరాల ప్రభుత్వ భూమిని జిల్లా ఞూ కార్యాలయ భవన నిర్మాణం కోసం లీజు ప్రాతిపదికన ఞూకి ఇచ్చేందుకు రెవెన్యూ (భూములు) శాఖ చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

13. రెవెన్యూ (భూములు) శాఖ:
చిత్తూరు జిల్లా చిత్తూరు మండలం తిమ్మసముద్రం గ్రామంలో 13.47 ఎకరాల భూమిని లేఔట్ అభివృద్ధి కోసం సాధారణ నిబంధనలకు లోబడి చిత్తూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ ఛైర్మన్‌కు బదిలీ చేసేందుకు రెవెన్యూ (భూములు) శాఖ చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

14. రెవెన్యూ (భూములు) శాఖ:
నెల్లూరు జిల్లా కండలేరు రిజర్వాయర్ నుండి శ్రీ సిటీలోని పారిశ్రామిక క్లస్టర్లకు నీటి సరఫరా కోసం DI నీటి పైప్‌లైన్ నిర్మాణానికి నెల్లూరు డివిజన్ రిజర్వ్ ఫారెస్టులో 1.30 హెక్టార్ల అటవీ భూమిని మళ్లించడం జరిగింది. దీనికి ప్రత్యామ్నాయంగా 6.42 ఎకరాల ప్రభుత్వ భూమిని అటవీ శాఖకు కేటాయించేందుకు వీలుగా, సాధారణ నిబంధనలకు లోబడి ZM, APIIC, నెల్లూరుకు బదిలీ చేసేందుకు రెవెన్యూ (భూములు) శాఖ చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

15. పురపాలక & పట్టణాభివృద్ధి శాఖ:
నూతనంగా పునర్వ్యవస్థీకరించిన జిల్లాల పరిధికి అనుగుణంగా ఆంధ్రప్రదేశ్‌లోని పట్టణాభివృద్ధి ప్రాధికార సంస్థలను పునర్వ్యవస్థీకరించేందుకు ప్రతిపాదనకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ఆంధ్రప్రదేశ్ మెట్రోపాలిటన్ రీజియన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీస్ చట్టం, 2016లోని సెక్షన్ 3 ప్రకారం ఈ పునర్వ్యవస్థీకరణ చేపట్టనున్నారు.

16. పరిశ్రమలు & వాణిజ్య శాఖ:
విజయవాడ జవహర్ ఆటోనగర్‌లోని APIIC హౌసింగ్ కాలనీలో 404 గృహ యూనిట్లకు అర్హులైన కేటాయింపుదారులు, తదుపరి కొనుగోలుదారులు, వారి చట్టబద్ధ వారసులు, వారసులు/సక్సెసర్లు మరియు ప్రస్తుత యజమానులకు సమాన ప్రాతిపదికన భూమి అవిభాజ్య వాటా, ఉమ్మడి స్థల హక్కులను క్రమబద్ధీకరించడం/కన్వేయన్స్ చేయడం, అలాగే అర్హత కలిగిన కేటాయింపుదారులు, చట్టబద్ధ వారసులు, సక్సెసర్లు, ప్రస్తుత యజమానుల విషయంలో అవసరమైన ర్యాటిఫికేషన్ డీడ్లను అమలు చేయడానికి ప్రతిపాదనకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

17. పరిశ్రమలు & వాణిజ్య శాఖ:
ఆమోదిత ప్రాజెక్టు ఆర్థిక వనరుల సమీకరణలో భాగంగా, రుణ వాటా కోసం HUDCO మంజూరు చేసిన రూ.680.21 కోట్ల టర్మ్ లోన్‌ను AP బల్క్ డ్రగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ ద్వారా పొందేందుకు ప్రతిపాదనకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

18. పరిశ్రమలు & వాణిజ్య శాఖ:
తే.11.12.2024 ద్వారా నోటిఫై చేసిన ఆంధ్రప్రదేశ్ టెక్స్‌టైల్స్, అపారెల్ & గార్మెంట్స్ పాలసీ (4.0) 2024-29లో ఉపాధి ఆధారిత ప్రోత్సాహకానికి సంబంధించిన క్లాజ్ 5.3(5)ను సవరించేందుకు చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

19. న్యాయ శాఖ:
రాష్ట్రంలో పరిశ్రమల స్థాపన, వాణిజ్య కార్యకలాపాల నిర్వహణను మరింత సులభతరం చేసే ఉద్దేశ్యంతో పలు చట్టాలను ఏకకాలంలో సవరించే లక్ష్యంతో ప్రతిపాదించిన "ఆంధ్రప్రదేశ్ ఆమ్నిబస్ (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) చట్టం, 2026" రూపకల్పనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో పెట్టుబడిదారులకు మరింత అనుకూలమైన పారిశ్రామిక వాతావరణాన్ని సృష్టించడం, వ్యాపారాలకు ఆటంకంగా ఉన్న పాత నిబంధనలను సరళీకృతం చేయడం, అనుమతుల ప్రక్రియలో ఉన్న అడ్డంకులను తొలగించడం ఈ చట్టం ప్రధాన ఉద్దేశ్యం. ఒకే బిల్లు (ఆమ్నిబస్) ద్వారా వివిధ చట్టాల్లో అవసరమైన సంస్కరణలను తీసుకురావడం ద్వారా ప్రభుత్వ విధానాలను మరింత పారదర్శకంగా మార్చనున్నారు. ఈ నిర్ణయంతో రాష్ట్రంలోకి భారీగా జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడం, పారిశ్రామిక ప్రగతిని వేగవంతం చేసి యువతకు విశేషంగా ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరనుంది.

20. రెవెన్యూ శాఖ:
చిత్తూరు జిల్లా, కుప్పం మండలంలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయ ప్రాజెక్టు కోసం భూసేకరణ ప్రక్రియను సజావుగా, వేగవంతంగా పూర్తి చేసేందుకు, డి-ఫారం పట్టాలు లేకుండా భూములను దీర్ఘకాలంగా సాగు చేస్తూ స్వాధీన అనుభవంలో ఉన్న రైతులు/సాగుదారులు భూముల అభివృద్ధికి చేసిన గణనీయ పెట్టుబడులు, భూసేకరణ వల్ల వారి జీవనోపాధిపై పడే ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకుని, ఎకరాకు రూ.12.44 లక్షల చొప్పున నష్ట పరిహారం చెల్లించేందుకు చేసిన ప్రతిపాదనకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ఈ చెల్లింపు భవిష్యత్ క్లెయిమ్‌లకు ఎటువంటి పూర్వనిదర్శనంగా పరిగణించకుండా, ఒకేసారి, కేసు-ప్రత్యేక చర్యగా అమలు చేయనున్నారు.

21. పురపాలక & పట్టణాభివృద్ధి శాఖ:
2026-27 ఆర్థిక సంవత్సరానికి రైతులకు యాన్యుటీల చెల్లింపు కోసం ఆంధ్రప్రదేశ్ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ నుండి రూ.300.00 కోట్ల రుణాన్ని పొందేందుకు ఞూజ=ణూ కమిషనర్ తీసుకున్న చర్యను ధృవీకరించే ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

22. పురపాలక & పట్టణాభివృద్ధి శాఖ:
అమరావతి క్యాపిటల్ సిటీలో అమరావతి ఐ అభివృద్ధిని పిపిపి-డిజైన్, బిల్డ్, ఫైనాన్స్, ఆపరేట్ అండ్ ట్రాన్స్‌ఫర్ పద్ధతిలో చేపట్టేందుకు టెండర్‌ను తిరిగి పిలిచేందుకు అనుమతించే ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

23. పురపాలక & పట్టణాభివృద్ధి శాఖ:
CRDA ప్రాంతంలోని వివిధ సంస్థలకు కొత్త భూ కేటాయింపులు మరియు గతంలో జరిపిన కేటాయింపుల సమీక్షకు సంబంధించిన కొత్త ప్రతిపాదనలపై GoM 28వ సమావేశం చేసిన సిఫార్సులను, APCRDA అథారిటీ తీర్మానం నెం.690/2026 ద్వారా ఆమోదించిన ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. జీఓఎం ప్రతిపాదనలు....

GSI - కొత్త అనుమతులు: అనంతవరం సర్వే నం.22లో 1.50 ఎకరాలు రాష్ట్ర ప్రధాన కార్యాలయం, ల్యాబొరేటరీ, మ్యూజియం కోసం ఎకరాకు రూ.4.1 కోట్ల చొప్పున 30 ఏళ్ల లీజుకు, మరో 0.57 ఎకరాలు అభివృద్ధి, పార్కు నిర్వహణ కోసం లీజుకు ప్రతిపాదించారు.

CAG - అనుమతి సవరణ: ఐనవోలులో గతంలో కేటాయించిన 12 ఎకరాల నుంచి 5 ఎకరాలను ఫ్రీహోల్డ్ పద్ధతిలో, స్థల మార్పిడితో స్టాఫ్ క్వార్టర్స్ కోసం కేటాయించేందుకు ప్రతిపాదన.

APIIC - కన్వెన్షన్ సెంటర్: ఐనవోలులో కేటాయించిన భూమిని 8 ఎకరాల నుంచి 5.09 ఎకరాలకు తగ్గించి, స్థల మార్పిడితో APCRDA పరిధిలో కేటాయించేందుకు ప్రతిపాదన.

APIIC-HUDCO జాయింట్ వెంచర్: గతంలో ఞఖణజూకు కేటాయించిన 9.17 ఎకరాల ఫ్రీహోల్డ్ కేటాయింపును రద్దు చేసి, MIC & మౌలిక వసతుల కోసం 10.20 ఎకరాలను CRDAకు పూర్తి హక్కులతో స్థల మార్పిడి ద్వారా కేటాయించేందుకు ప్రతిపాదన.

24. పురపాలక & పట్టణాభివృద్ధి శాఖ:
పురపాలక & పట్టణాభివృద్ధి శాఖ, తే.11.10.2018 మేరకు రెండో దశ భూ సమీకరణ పథకం కింద పల్నాడు జిల్లా వైకుంఠపురం గ్రామంలోని దేవదాయ ఇనాం భూములకు సంబంధించిన పరస్పర వివాద దావాలను పరిష్కరించేందుకు దేవదాయ శాఖకు రూ.122.20 కోట్ల పరిహారం చెల్లించే ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

25. పురపాలక & పట్టణాభివృద్ధి శాఖ:
అమరావతి క్వాంటమ్ వ్యాలీ టెక్ పార్క్‌లోని క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్‌కు ఇరువైపులా T1, T2 ట్విన్ ఆఫీస్ టవర్స్ నిర్మాణానికి సంబంధించి, EDGE అడ్వాన్స్‌డ్ సర్టిఫికేషన్ ప్రమాణాలకు అనుగుణంగా షెల్ & కోర్ నిర్మాణ పనులను డిజైన్ అండ్ బిల్డ్ లంప్‌సమ్ కాంట్రాక్ట్ (శాతం టెండర్) విధానంలో చేపట్టేందుకు L1 బిడ్డర్‌ను ఖరారు చేసే ప్రక్రియను నిర్వహించడానికి AGICL మేనేజింగ్ డైరెక్టర్‌కు అధికారం కల్పించే ప్రతిపాదనకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

26. పురపాలక & పట్టణాభివృద్ధి శాఖ:
హైకోర్టు భవనం నిర్మిత విస్తీర్ణం పెరగడం వల్ల విస్తరించిన కన్సల్టెన్సీ సేవల పరిధికి, తదనుగుణంగా పెరిగిన కన్సల్టెన్సీ ఫీజుకు, అలాగే శాసనసభ మరియు హైకోర్టు భవనాల కోసం అదనపు స్పెషలిస్ట్ కన్సల్టెంట్లను నియమించేందుకు మరియు వారికి సంబంధించిన అదనపు కన్సల్టెన్సీ ఫీజు చెల్లింపునకు GSTతో కలిపి రూ.206.59 కోట్లు మొత్తానికి సవరించిన పరిపాలనా అనుమతి ఇచ్చే ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

శాసనసభ-హైకోర్టు భవనాల కన్సల్టెన్సీ: APCRDA, Hafeez Contractor, Foster + Partners (UK), Foster + Partners India కన్సార్టియంను 10.07.2025న నియమించింది. హైకోర్టు కోర్టు హాళ్లు 40 నుంచి 52కు పెరగడంతో 87,543.36 చ.అ. అదనపు బిల్ట్-అప్ ఏరియా, కన్సల్టెన్సీ పరిధి మరియు నిపుణుల వనరులు పెరిగాయి. వేగవంతమైన నిర్మాణ షెడ్యూల్‌కు అదనపు వనరులు వినియోగించాల్సి రావడంతో పాటు, GBP మారకపు రేటు ?109 నుంచి 128.215కు పెరగడం వల్ల 1,910,177 చెల్లింపులకు అదనపు బడ్జెట్ అవసరం ఏర్పడింది.

27. ఆర్థిక శాఖ:
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్య విధానం, 2026 ముసాయిదా బిల్లును ఆమోదించే ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. రాష్ట్రాన్ని పెట్టుబడుల గమ్యస్థానంగా మార్చే లక్ష్యంగా రవాణా, లాజిస్టిక్స్, పోర్టులు, విమానాశ్రయాలు, పట్టణ మౌలిక వసతులు, వైద్యం, విద్య, పారిశ్రామికాభివృద్ధి, పునరుత్పాదక ఇంధనం, పర్యాటకం తదితర కీలక రంగాల్లో భారీ పెట్టుబడులను ఆకర్షించేందుకు ఈ నూతన పాలసీని తీసుకొస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో రూ. 1.23 లక్షల కోట్ల విలువైన పీపీపీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల పైప్‌లైన్‌లో ఉండగా, ప్రైవేట్ పెట్టుబడిదారులను ఆకర్షించి ఈ ప్రాజెక్టులను త్వరితగతిన పట్టాలెక్కించేందుకు వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రూ. 1,500 కోట్లను కేటాయించింది. ఈ ఏడాది బడ్జెట్‌లో ప్రకటించిన స్టేట్ వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ VGF తో పాటు, ప్రారంభ దశలో లాభదాయకంగా లేకపోయినా భవిష్యత్తులో ఆదాయం వచ్చే అవకాశమున్న ప్రాజెక్టులకు వడ్డీ లేని రుణాలు అందించేందుకు ఒక ప్రత్యేకమైన 'బ్రిడ్జ్ ఫండ్'ను కూడా ఈ పాలసీలో పొందుపరిచారు. పెట్టుబడిదారుల్లో విశ్వాసాన్ని పెంచే పారదర్శక విధానాల ద్వారా భారీ ఎత్తున ప్రైవేట్ పెట్టుబడుల సమీకరణ, పీపీపీ ప్రాజెక్టుల సత్వర అమలు, ప్రాజెక్టుల పర్యవేక్షణ మరియు ప్రజలకు మెరుగైన నాణ్యమైన సేవలందించడం ఈ పాలసీ ప్రధాన ఉద్దేశం.

28. ఉన్నత విద్యా శాఖ:
ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ యూనివర్సిటీల (స్థాపన, నియంత్రణ) చట్టం, 2016 (2016 నాటి చట్టం నం.3)లోని షెడ్యూల్‌కు సవరణలు చేసి, "RVS యూనివర్సిటీ", "ప్రగతి యూనివర్సిటీ" పేర్లను చేర్చడంతో పాటు, సంబంధిత స్పాన్సరింగ్ బాడీలకు బ్రౌన్‌ఫీల్డ్ కేటగిరీ కింద ఈ రెండు ప్రైవేట్ యూనివర్సిటీలను స్థాపించేందుకు అనుమతిస్తూ ఆర్డినెన్స్ జారీ చేయాలన్న ప్రతిపాదనకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

29. పాఠశాల విద్యా శాఖ:
నూతనంగా ఏర్పాటు చేసిన జిల్లాలకు అనుగుణంగా 15 జిల్లా విద్యాశాఖాధికారి పోస్టులను సృష్టించడంతో పాటు, మొత్తం పోస్టుల్లో 50 శాతం పోస్టులను ప్రత్యక్ష నియామకం ద్వారా భర్తీ చేయడానికి, రాబోయే గ్రూప్-I నోటిఫికేషన్‌లో 14 ఞజూ ఖాళీలను చేర్చి భర్తీ చేసేందుకు అవసరమైన ఏపీ ఎడ్యుకేషనల్ సర్వీస్ రూల్స్, 1998లో తగిన సవరణలు చేయాలన్న ప్రతిపాదనకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

జిల్లా విద్యాశాఖాధికారి పోస్టుల్లో 50 శాతం పోస్టులను రాబోయే APPSC గ్రూప్-1 నోటిఫికేషన్‌లో జాబ్ క్యాలెండర్‌లో భాగంగా భర్తీ చేయనున్నారు.

30. జల వనరుల శాఖ:
రాబోయే గోదావరి పుష్కరాలు-2027 దృష్ట్యా తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, పోలవరం, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ, కాకినాడ మరియు ఏలూరు జిల్లాల్లో 238 "స్నాన ఘట్టాల పనులు" మరియు ఇతర పనుల కోసం రూ.210.06 కోట్లకు పరిపాలనా అనుమతి ఇచ్చే ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

31. ఐ.టి.ఇ & సి:
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా మొబైల్ టవర్లు మరియు అనుబంధ టెలికాం మౌలిక వసతుల ఏర్పాటుకు ప్రభుత్వ భూమిని అద్దె రుసుము లేకుండా అందించడంతో పాటు, రాయితీతో కూడిన విద్యుత్ సరఫరా కల్పించేందుకు ప్రతిపాదనకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

32. పురపాలక & పట్టణాభివృద్ధి శాఖ:
గుంటూరు జిల్లా తాడికొండ మండలం, మోతడక గ్రామంలోని మొత్తం 2344.12 ఎకరాల భూమిలో, అమరావతి మీదుగా ఎర్రుపాలెం - నంబూరు మధ్య కొత్త బ్రాడ్ గేజ్ రైల్వే లైన్ (ఇరువైపులా 50 మీటర్ల చొప్పున మొత్తం 100 మీటర్ల బఫర్ జోన్‌తో) నిర్మాణం మరియు ఇన్నర్ రింగ్ రోడ్ ఏర్పాటు కోసం గ్రామసభ తీర్మానానికి అనుగుణంగా ల్యాండ్ పూలింగ్ స్కీమ్ చేపట్టేందుకు APCRDA కమిషనర్‌కు అనుమతినిచ్చే ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. రైల్వే మంత్రిత్వ శాఖ రూ. 2,047.40 కోట్ల అంచనా వ్యయంతో 56.53 కి.మీ మేర ఈ కొత్త రైల్వే లైన్‌ను ప్రతిపాదించగా, భూసేకరణకు బదులుగా ల్యాండ్ పూలింగ్ విధానంలో తమ భూములను స్వచ్ఛందంగా ఇచ్చేందుకు మోతడక గ్రామ సభ తీర్మానించడం విశేషం.

ఈ ప్రాజెక్టుల ద్వారా రాజధాని అమరావతికి నేరుగా రైలు మరియు రోడ్డు అనుసంధానం ఏర్పడి ప్రయాణ సమయం గణనీయంగా తగ్గనుంది. అంతేకాకుండా పారిశ్రామిక, వాణిజ్య, ఐటీ, విద్య, వైద్య, పర్యాటక రంగాల్లో భారీగా పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా ఆర్థిక వృద్ధికి, అలాగే శాటిలైట్ టౌన్ల అభివృద్ధికి ఇది విశేషంగా దోహదపడుతుంది.

ఈ పథకం కింద స్వచ్ఛందంగా భూములిచ్చిన రైతులకు రిటర్నబుల్ ప్లాట్లు, యాన్యుటీ, ఒకేసారి వ్యవసాయ రుణ మాఫీ, పెన్షన్లు తదితర ప్రయోజనాలు ఞూూ నిబంధనల ప్రకారం అందనున్నాయి.

# ప్రజలే మా పాలనకు సర్టిఫికెట్ ఇస్తున్నారు

**- 'రెండేళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం' ఇంటింటి ప్రచారంలో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి - బుచ్చిరెడ్డిపాళెంలో రూ.7.26 కోట్ల తాగునీటి పైప్‌లైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన - కట్టుబడిపాళెం పరిధిలో రూ.1.63 కోట్ల అభివృద్ధి పనులు - మెగా డీఎస్సీపై వస్తున్న ఆరోపణలపై ఆగ్రహం**

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేసినందుకే నేడు ధైర్యంగా ప్రజల ముందుకు వస్తున్నామని, ఇంటింటికీ వెళ్లినప్పుడు ప్రభుత్వ పనితీరుకు ప్రజలే సర్టిఫికెట్ ఇస్తున్నారని కోవూరు శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. బుధవారం బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని కట్టుబడిపాళెం 1వ వార్డులో నిర్వహించిన 'రెండేళ్ల నమ్మకం – అభివృద్ధి, సంక్షేమం' ఇంటింటి ప్రచార కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అంతకుముందు రూ.7.26 కోట్లతో పెద్దూరు, పురంధరపురం, రామచంద్రాపురం, కట్టుబడిపాళెం లేఅవుట్లు, వీకర్స్ సెక్షన్ కాలనీల్లో తాగునీటి సరఫరా పైప్‌లైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేసిన ఎమ్మెల్యే గారు, రెండేళ్లలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. స్థానికుల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పనితీరును ప్రజలకు వివరించడంతో పాటు వారి సమస్యలను నేరుగా తెలుసుకుని రాబోయే మూడేళ్లలో పరిష్కరించే దిశగా కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. 45 రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని కూటమి నాయకులంతా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల ముందు ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలతో పాటు దాదాపు 99 శాతం వాగ్దానాలను రెండేళ్లలోనే అమలు చేశామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వృద్ధులకు రూ.4 వేల పెన్షన్, దివ్యాంగులకు రూ.6 వేల పెన్షన్, మంచానికే పరిమితమైన వారికి రూ.15 వేల పెన్షన్ అందిస్తున్నామని తెలిపారు.



తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, దీపం-2 కింద మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఆటో సేవలో, మత్స్యకారుల సేవలో, అన్నా క్యాంటీన్లు వంటి పథకాల ద్వారా అన్ని వర్గాల ప్రజలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని చెప్పారు. మెగా డీఎస్సీ నిర్వహించి 16 వేల మంది ఉపాధ్యాయులకు ఉద్యోగాలు కల్పించామని, త్వరలో మరో 2 నుంచి 3 వేల టీచర్ పోస్టులను కూడా భర్తీ చేయనున్నట్లు తెలిపారు. కోవూరు నియోజకవర్గంలో బీపీసీఎల్, ఇఫ్కో కిసాన్ సెజ్‌లో భారీ పరిశ్రమలు ఏర్పాటవుతుండటంతో స్థానిక యువతకు మరిన్ని ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా కోవూరు నియోజకవర్గంలోని పేద కుటుంబాలకు గత 27 నెలల్లో రూ.10.50 కోట్ల ఆర్థిక సహాయం అందించామని ఎమ్మెల్యే వెల్లడించారు.

**కట్టుబడిపాళెంలో రూ.1.63 కోట్ల అభివృద్ధి**

గత రెండేళ్లలో కట్టుబడిపాళెం పరిధిలో మొత్తం దాదాపు రూ.1.63 కోట్ల విలువైన అభివృద్ధి, సంక్షేమ పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే వివరించారు. మున్సిపల్ శాఖ ద్వారా రూ.22.31 లక్షలతో నాలుగు సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్ల నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో సుమారు ఐదేళ్లుగా అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవనాన్ని రూ.5.80 లక్షలతో పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. విద్యుత్ శాఖ ద్వారా మొత్తం రూ.64.20 లక్షలు వెచ్చించి రెండు 100 కేవీ, రెండు 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడంతో పాటు 11 కేవీ, ఎల్‌టీవీ విద్యుత్ లైన్ల విస్తరణ, 200 విద్యుత్ స్తంభాల ఏర్పాటు, ఎస్సీ-ఎస్టీ సబ్‌ప్లాన్ కింద 47 ఇళ్లకు సోలార్ రూఫ్‌టాప్ కనెక్షన్లు కల్పించినట్లు తెలిపారు. సిఎస్ఆర్ నిధుల కింద వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా రూ.38.95 లక్షలతో హరిజనవాడ నుంచి కట్టుబడిపాళెం వరకు తాగునీటి సదుపాయం కల్పించినట్లు చెప్పారు. సొంత స్థలాలు ఉన్న 34 కుటుంబాల ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా 9 పేద కుటుంబాలకు రూ.7.39 లక్షల ఆర్థిక సహాయం అందించినట్లు వెల్లడించారు. ధర్మాదాయ, దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో టీటీడీ శ్రీవాణి ట్రస్టు ద్వారా ఈశ్వరమ్మ ఆలయంలో రూ.30 లక్షలతో భజన మందిరాల నిర్మాణం చేపట్టినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

**బుచ్చిలో వరుసగా భారీ ప్రాజెక్టులు**

బుచ్చిరెడ్డిపాళెంలో మౌలిక వసతుల అభివృద్ధికి వరుసగా ప్రాజెక్టులు అమలవుతున్నాయని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి తెలిపారు. రూ.14.40 కోట్లతో ఎన్‌హెచ్-67 పరిధిలో మౌలిక వసతుల పనులు త్వరలో ప్రారంభం కానున్నాయని, రూ.4 కోట్లతో నిర్మించిన మున్సిపల్ కార్యాలయాన్ని త్వరలో ప్రారంభిస్తామని చెప్పారు. రూ.2.50 కోట్లతో అగ్నిమాపక కేంద్రం నిర్మాణం పూర్తయిందని, బుచ్చిని గ్రేడ్-2 మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేశామని వెల్లడించారు. ఎంఆర్వో కార్యాలయ ప్రధాన రహదారి, మార్కెట్ రోడ్డు, కాజా నగర్-పీర్ల కాలువ మధ్య సీసీ డ్రెయిన్ల నిర్మాణం వంటి పలు అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. కాజా నగర్ ఉర్దూ పాఠశాలలో పదో తరగతి వరకు విద్య అందుబాటులోకి తీసుకురావడానికి ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సహకారంతో వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా స్థలం కొనుగోలు చేసి అదనపు తరగతి గదులు నిర్మిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు.

**డీఎస్సీపై మాట్లాడే హక్కు మీకెక్కడిది?**

మెగా డీఎస్సీ నిర్వహించి 16 వేల మంది ఉపాధ్యాయులకు ఉద్యోగాలు కల్పించినప్పటికీ, దానిపైనా విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని ఎమ్మెల్యే అన్నారు. గత ఐదేళ్లలో డీఎస్సీ నిర్వహించక వేలాది మంది అభ్యర్థులు వయోపరిమితి కారణంగా అవకాశాలు కోల్పోయిన విషయాన్ని విమర్శలు చేస్తున్న వారు గుర్తు చేసుకోవాలని సూచించారు.

ఇప్పుడు ఉద్యోగాలు పొందిన ఉపాధ్యాయుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా ర్యాలీలు, నిరసనలు చేయడం ఏంటని ప్రశ్నించారు. అభివృద్ధి పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే తమ ప్రభుత్వ లక్ష్యమని, శంకుస్థాపనలు చేసి పనులను మధ్యలోనే వదిలేసే సంస్కృతి కూటమి ప్రభుత్వానికి లేదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గతంలో అసంపూర్తిగా నిలిచిపోయిన పలు పనులను పూర్తి చేసి ప్రారంభోత్సవాలు చేస్తున్నామని, బుచ్చిరెడ్డిపాళెం మున్సిపల్ కార్యాలయం అందుకు నిదర్శనమని అన్నారు.

## 12వ జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు - 2026









**విజయవాడ, (రాజధాని వార్తలు):** భారత ప్రభుత్వ జౌళి మంత్రిత్వ శాఖ, డెవలప్‌మెంట్ కమిషనర్ (చేనేత) కార్యాలయం పరిధిలోని చేనేత సేవా కేంద్రం, విజయవాడ ఆధ్వర్యంలో 12వ జాతీయ చేనేత దినోత్సవం-2026 సందర్భాన్ని పురస్కరించుకుని అమరావతిలోని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ డిజైన్, ఆంధ్రప్రదేశ్‌లో 05 ఆగస్టు 2026న సాయంత్రం 04:00 గంటలకు ఒక ప్రత్యేక కార్యక్రమం నిర్వహించబడుతోంది. 1905 నాటి చారిత్రాత్మక స్వదేశీ ఉద్యమాన్ని స్మరించుకోవడానికి మరియు దేశ సాంస్కృతిక జౌళి వారసత్వాన్ని పరిరక్షించడంలో భారతీయ చేనేత నేతకారుల అమూల్యమైన రంగాన్ని గుర్తించడానికి ప్రతి సంవత్సరం ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవాన్ని జరుపుకుం టారు. అసలైన చేనేత ఉత్పత్తులపై అవగాహన పెంచడం, సాం ప్రదాయ నేత రీతులను అభినందించేలా యువతను ప్రోత్సహిం చడం మరియు చేనేత వస్త్రాల వినియోగాన్ని పెంపొందించడం ఈ వేడుకల ముఖ్య ఉద్దేశం. NID, ఆంధ్రప్రదేశ్‌లో జరిగే ఈ కార్యక్రమంలో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన, ప్రత్యక్ష నేత ప్రదర్శ నలు, చేనేత క్విజ్ పోటీలు, డిజైన్ పోటీలు మరియు NID విద్యార్థులచే ఆకర్షణీయమైన చేనేత ఫ్యాషన్ షో / చీర కట్టుకునే పోటీలు నిర్వహించబడతాయి. ఈ కార్యకలాపాలు భారతీయ చేనేత రంగానికి చెందిన సౌందర్యాన్ని, నైపుణ్యాన్ని, ఆవిష్కరణలను మరియు సుస్థిరతను ప్రతిబింబించడంతో పాటు డిజైనర్లు, చేతివృత్తుల కళాకారులు, విద్యార్థులు మరియు చేనేత రంగానికి చెందిన ప్రజల మధ్య అనుసంధానాన్ని పెంచుతాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకావాల్సిందిగా నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ డిజైన్, ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్‌ని ఆహ్వానించడం జరిగింది. ఈ వేడుకల్లో 300 మందికి పైగా విద్యార్థులు, అధ్యాపకులు, అధికారులు, సిబ్బంది, చేనేత కార్మికులు, జౌళి మంత్రిత్వ శాఖ అధికారులు, చేనేత సంస్థల ప్రతినిధులు మరియు ఇతర విశిష్ట అతిథులు పాల్గొంటారని భావిస్తున్నారు. భారతదేశ సంపన్న చేనేత వారసత్వాన్ని పరిరక్షించడం, ప్రోత్సహించడం మరియు మద్దతు ఇవ్వడం అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడానికి ఈ కార్యక్రమాన్ని కవర్ చేయాల్సిందిగా ప్రింట్, ఎలక్ట్రానిక్ మరియు డిజిటల్ మీడియా ప్రతినిధులను చేనేత సేవా కేంద్రం, విజయవాడ సాదరంగా ఆహ్వానిస్తోంది.

## పేద వైద్య విద్యార్థులకు "ఫోనిక్స్" చేయూత

**- డా.ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయంతో అవగాహన ఒప్పందం**
**- ప్రతిభకు పేదరికం అడ్డుకాకూడదు : మంత్రి సత్యకుమార్ యాదవ్**
**- ఈ ఏడాది 10 మందికి.. దశలవారీగా ఏటా 50 మందికి ఉపకార వేతనాలు**

**విజయవాడ, (రాజధాని వార్తలు):** ఆర్థిక ఇబ్బందుల కారణంగా ప్రతిభావంతులైన విద్యార్థులు వైద్య విద్యకు దూరం కాకూడదని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ఫోనిక్స్ ఫౌండేషన్, డా.ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం మధ్య గురువారం మంత్రి సమక్షంలో అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందంతో ఎంపికైన విద్యార్థులకు వైద్య కోర్సు పూర్తయ్యే వరకు చదువు, వసతి ఖర్చులకు ఆర్థిక సహాయం అందనుంది. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ.. ప్రతిభ ఉన్న విద్యార్థుల భవిష్యత్తును కుటుంబ ఆర్థిక పరిస్థితులు నిర్ణయించకూడదన్నారు. పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు వైద్యులుగా ఎదిగేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషికి ఫోనిక్స్ ఫౌండేషన్ సహకారం తోడవుతుందని తెలిపారు. ఆర్థిక సాయంతోనే సరిపెట్టకుండా విద్యార్థులకు నిరంతర మార్గదర్శకత్వం అందించడం ఈ కార్యక్రమం ప్రత్యేకతని చెప్పారు. ఉపకారవేతనాలు పొందే విద్యార్థులు ఉత్తమ వైద్యులుగా ఎదిగి పేదలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. దివంగత చుక్కపల్లి శంకరరావు జ్ఞాపకార్థం ఆయన శతజయంతి సందర్భంగా 2025లో ఫీనిక్స్ ఫౌండేషన్ వైద్య ఉపకారవేతన కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఆర్థిక పరిస్థితులతో సంబంధం లేకుండా ప్రతిభావంతులైన యువతకు అవకాశాలు కల్పించాలన్న ఆయన ఆశయాన్ని కొనసాగించేందుకు ఈ పథకాన్ని చేపట్టారు. 2026-27 విద్యా సంవత్సరంలో తొలుత 10 మంది విద్యార్థులను ఎంపిక చేస్తారు. 2027-28లో 20 మంది, 2028-29లో 30 మంది, 2029-30లో 40 మంది, 2030-31లో 50 మందికి కొత్తగా ఉపకారవేతనాలు అందిస్తారు. 2031-32 నుంచి ప్రతి సంవత్సరం 50 మంది కొత్త విద్యార్థులను ఎంపిక చేస్తారు. ఎంపికైన వారికి వైద్య కోర్సు పూర్తయ్యే వరకు నిబంధనల మేరకు ట్యూషన్ ఫీజులో వందశాతం వరకు సాయం అందిస్తారు. అవసరమైన వారికి వసతి గృహ రుసుములను కూడా చెల్లిస్తారు. ఒక్కో విద్యార్థికి ఏడాదికి కనీసం రూ.1.50 లక్షల ఆర్థిక సహాయం అందేలా పథకాన్ని రూపొందించారు. ఈ మొత్తాన్ని నేరుగా



సంబంధిత విద్యాసంస్థ బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు. విద్యార్థుల చదువు, వ్యక్తిత్వ వికాసం, వృత్తిపరమైన అభివృద్ధికి ప్రత్యేక మార్గదర్శక కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.5 లక్షల్లోపు ఉండి, ఎంపిక చేసిన ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 2026-27 నుంచి ఎంబీబీ ఎస్‌లో చేరిన విద్యార్థులు అర్హులు. చదువులో ప్రతిభ, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత, సమాజ సేవపై ఆసక్తిని పరిగణ నలోకి తీసుకుంటారు. దివ్యాంగులు, నిరుపేద కుటుంబాల విద్యా ర్థులు, బాలికలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తారు. ఇతర ప్రభుత్వ లేదా ప్రైవేటు ఉపకారవేతనాలు పొందుతున్నవారు ఈ పథకానికి అర్హులు కారు. విశ్వవిద్యాలయం పరిశీలించి గరిష్ఠంగా 40 మంది పేర్లను ఫీనిక్స్ ఫౌండేషన్‌కు పంపుతుంది. విద్యా ప్రతిభ, విద్యార్థి నేపథ్యం, వ్యాసరచన, వ్యక్తిగత ముఖాముఖి ఆధారంగా వారిలో 10 మందిని ఎంపిక చేస్తారు. ప్రతి సంవత్సరం విద్యార్థుల చదువు, ఇతర కార్యక్రమాల్లో పాల్గొనడం, సామాజిక బాధ్యతను పరిశీలించిన తరువాతే ఉపకారవేతనాన్ని కొనసాగిస్తారు.

**మంత్రి సమక్షంలో సంతకాలు**

రాష్ట్ర వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ సమక్షంలో ఒప్పంద పత్రాలపై యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ సాయి సుధీర్, ఫోనిక్స్ ముఖ్య నిర్వాహకులు చుక్కపల్లి సురేష్, సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ చంద్రశేఖర్ జాయింట్ రిజిస్ట్రార్ నీలిమ, ఫోనిక్స్ ముఖ్య ప్రతినిధి బొమ్మినేని భాస్కరరెడ్డి పాల్గొన్నారు.

## మానసిక ఉల్లాసానికి క్రీడలు ప్రధానం

**గూడూరు, (రాజధాని వార్తలు):** శారీరక దారుఢ్యానికి మానసిక ఉల్లాసానికి క్రీడలు ప్రధానమని గూడూరు రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. గూడూరు రైల్వే ఇన్స్టిట్యూట్ నూతన కమిటీ ఆధ్వర్యంలో ఉద్యోగుల మానసిక ఉల్లాసానికి క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నారని ఐదు రోజులపాటు పోటీలు జరుగుతా యని ఉద్యోగులందరూ క్రీడా స్ఫూర్తితో ఉండాలని గూడూరు రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు సూచించారు. బుధవారం గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో రైల్వే ఇన్స్టిట్యూట్ నూతన కమిటీ ఆధ్వర్యంలో ఉద్యోగులకు క్రికెట్ పోటీలు ఏర్పాటు చేశారు. ఐదు రోజులపాటు పోటీలు జరగనున్నాయి విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో 16 జట్లు పాల్గొంటున్నాయి ముఖ్యఅతిథిగా విచ్చేసిన స్టేషన్ సూపర్డెంట్ వెంకటేశ్వరరావు క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ రైల్వే ఇన్స్టిట్యూట్ ఇటీవల నూతన కమిటీ ఎంపిక కావడం జరిగిందని



వారి ఆధ్వర్యంలో ఉద్యోగులకు ఆటవిడుపుగా క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఆగస్టు 15వ తేదీలోపు రైల్వే ఇన్స్టిట్యూట్ వద్ద మహిళలకు కూడా క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తారని వెల్లడించారు. క్రీడాకారులందరూ ఎటు వంటి విభేదాలు లేకుండా క్రీడా స్ఫూర్తితో ఆడాలన్నారు.

## 53వ ప్రగతి సమావేశం - సైబర్ నేరాలు, డిజిటల్ అరెస్టులపై సమీక్ష

**విజయవాడ, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ సచివాలయం నుంచి దృశ్య శ్రవణ సమావేశం ద్వారా సమావేశంలో పాల్గొన్న ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్, ఇఎస్సిఆర్డి ఐజి ఎ. రవి కృష్ణ, ఎస్పి అధిరాజ్ సింగ్ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో రాష్ట్ర సైబర్ నేరాల సమన్వయ కేంద్రం ఏర్పాటు, బలోపేతానికి సూచనలు. సైబర్ నేరాలపై ఫిర్యాదుల నమోదును వేగవంతం చేసేందుకు ఎలక్ట్రానిక్-శూన్య మొదటి సమాచార నివేదిక అమలుకు ప్రాధాన్యత. ఫిర్యాదుల పరిష్కార విభాగంలో నమోదైన ఫిర్యాదులను నిర్ణీత సమయంలో పరిష్కరించాలి. సైబర్ ఆర్థిక మోసాల్లో బాధితులకు నగదు తిరిగి అందించేందుకు ధన పునరుద్ధరణ విభాగం వినియోగించాలి. అక్రమ, చట్టవిరుద్ధ డిజిటల్ కంటెంట్ తొలగింపునకు 'సహయోగ్ అంతర్జాల వేదిక'ను సమర్థవంతంగా వినియోగించాలి. సైబర్ నేరాలపై ముందస్తు హెచ్చరికలు, సమాచార మార్పిడి, సమన్వయం, నివారణ చర్యలకు 'సమన్వయ్ అంతర్జాల వేదిక' వినియోగం. సైబర్ నేరాలు అధికంగా నమోదవుతున్న సైబర్ నేరాల సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక చర్యలు. సైబర్ నేరాల దర్యాప్తులో చట్ట అమలు అధికారుల సామర్థ్యాలను పెంచేందుకు ప్రత్యేక శిక్షణ. సైట్రైన్ ద్వారా పోలీసు సిబ్బందికి సైబర్ నేరాల దర్యాప్తు, ఆధునిక సాంకేతికతపై శిక్షణ. సైబర్ నేరాలపై సమర్థవంతమైన చర్యలకు సైబర్ కమాండోలను అభివృద్ధి చేయాలి. సమాచారం, విద్య మరియు సమాచార ప్రసార కార్యక్రమాల ద్వారా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలి. డిజిటల్ అరెస్టులు, ఏకకాలిక రహస్య పదం (ఓటిపి) మోసాలు, ఫిషింగ్, అంతర్జాల ఆర్థిక మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి. సైబర్ మోసం జరిగిన వెంటనే ఫిర్యాదు చేసేలా ప్రజలను అప్రమత్తం చేయాలి. సైబర్ నేరాల నియంత్రణలో "నేరం జరిగిన తర్వాత స్పందన" నుంచి "నేరం జరగకముందే నివారణ" దిశగా చర్యలు. సాంకేతికత, డేటా విశ్లేషణ, అంతర్రాష్ట్ర సమన్వయంతో సైబర్ నేరాల నియంత్రణకు సమగ్ర కార్యాచరణ. సైబర్ నేర బాధితులకు వేగవంతమైన సహాయం, ఆర్థిక నష్టం పునరుద్ధరణ, సత్వర న్యాయం అందేలా చర్యలు.

# సంపాదకీయం

## పొంచి వున్న నైపుణ్యాల సంక్షోభం

ఢిల్లీలో జరిగిన జెన్ జీ ఆందోళనలు ఉవ్వెత్తున ఎగసి విస్తరించటం దేశాన్ని నివ్వెరపరిచింది. 'నీట్' పరీక్షాపత్రం లీక్ పట్ల ఆగ్రహంగా మొదలైన యువత నిరసన.. చివరకు పెరుగుతున్న నిరుద్యోగం, సామాజిక నిరాశా నిస్పృహల పట్ల ప్రతిఘటనోద్యమంగా పరిణమించింది. డిగ్రీలున్నా ఉద్యోగాలు రాకపోవటం, ఆకాంక్షలు పెరుగుతున్నా తగినంతగా అవకాశాలు లేకపోవటం యువతను తిరగబడేలా చేసింది. ప్రవేశ పరీక్షాపత్రం లీకవటం యువతను సమీకరించే ఒక నిప్పురవ్వ మాత్రమే. దాని వెనక దాగివున్న సంక్షోభం నిజమైనది, సంక్లిష్టమైనది. పాఠశాలల్లో కావచ్చు, కాలేజీల్లో కావచ్చు.. మన విద్యావ్యవస్థ చాలామేర కుప్పకూలింది. పిల్లల్లో 80శాతం మంది స్కూలు విద్యలో పాసవుతున్నారు కానీ, వారికి చదువులో ఎటువంటి నిజమైన పునాదీ ఉండటం లేదు. ఇందులో వారి తప్పు కూడా ఏమీ లేదు. బట్టీపట్టటం ద్వారా నేర్చుకోవటం, మూకుమ్మడి కాపీయింగ్‌లతో పాసవటం అనే అవ్యవస్థ వారి భవిష్యత్తుతో చెలగాటమాడుతోంది. రెండోది, విద్యార్థులు ఏం నేర్చుకున్నారో బేరీజు వేసే పరీక్షా పద్ధతులు అర్థరహితంగా ఉండటంతో.. అత్యధిక శాతం ఆరాటపడే 'స్టెమ్' (సైన్స్-టెక్నాలజీ-ఇంజినీరింగ్-మ్యాథ్స్) కోర్సుల్లో చేరేందుకు ప్రత్యేకంగా పోటీ ప్రవేశ పరీక్షలు అవసరమయ్యాయి. మూడోది, చాలా సందర్భాల్లో రాష్ట్రాలు నిర్వహించే పరీక్షా పద్ధతుల్లో విశ్వసనీయత లోపిస్తోంది. బోర్డు ప్రమాణాల్లో రాష్ట్రాల మధ్య భారీ అంతరం ఉంటోంది. దీంతో, ప్రామాణిక, నిష్పాక్షిక, న్యాయమైన బేరీజు కోసం దేశవ్యాప్తంగా ఒకే ప్రవేశ పరీక్ష అవసరమవుతోంది. నాలుగోది, వైద్య కళాశాలలు పుట్టగొడుగుల్లా పెరిగినప్పటికీ, ఎంపిక చేసిన కొన్ని కళాశాలలు మాత్రమే యువ మెడికోలకు కనీస ప్రమాణాల శిక్షణను అందించగలుగుతున్నాయి. కాబట్టి, లక్షలాది మందికి వైద్య కళాశాలల్లో సీట్లు అందుబాటులో ఉన్నా, మెరుగైన కొన్ని కళాశాలలకే డిమాండ్ ఉంది. వాటిల్లో చేరేందుకు ఉత్తమ ర్యాంకుల కోసం విపరీత పోటీ ఉంటోంది. అయిదోది, మెడికల్ పోటీ ప్రవేశ పరీక్షకు విద్యార్థులను సన్నద్ధం చేసే డిమాండ్‌కు అనుగుణంగా అనేక కోచింగ్ సెంటర్లు వెలిశాయి. పదవ తరగతి తర్వాత శిక్షణ-చదువును విభాగాలవారీ ప్యాకేజీలతో అందించనారంభించాయి. పోటీ, పాఠశాల పునాదులు బలహీనంగా ఉండటం వల్ల.. ఆ రెండేళ్లపాటు యువ విద్యార్థులు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. ఇంత మితిమీరిన ఒత్తిడి వాతావరణంలో, పరీక్షా పత్రం లీక్ అయిందంటే-అది యువతకు, వారి తల్లిదండ్రులకు శరాఘాతమే. ఈ నేపథ్యంలో నీట్ పేపర్ లీక్ అంతటి అలజడికి దారితీయటంలో ఆశ్చర్యమేమీ లేదు. విద్యార్థులు, తల్లిదండ్రుల బాధను గ్రహించి కేంద్ర ప్రభుత్వం సహానుభూతితో సకాలంలో బలంగా స్పందించి ఉండాల్సింది. రాజకీయంగా సున్నితంగా వారితో కూర్చుని మాట్లాడాల్సింది. అలాగాక, సవాలక్ష సమస్యల్లో ఇదొకటి అన్నట్లుగా ప్రభుత్వం వ్యవహరించింది. భారీఎత్తున యువత స్వచ్ఛందంగా తరలివచ్చే ఓ ఉద్యమానికి నిప్పురవ్వ రాజుకుంటోందని అంచనా వేయలేకపోయింది. అధికారాన్వేషణలో మునిగితేలే మనలాంటి సమాజంలో ఇలాంటి తక్షణ రాజకీయ పర్యవసానాలు రసవత్తరంగా అనిపిస్తాయి గానీ, మనం ఆ నిప్పురవ్వను దాటి ఆలోచించాలి. ఏమాత్రం ఆజ్యం తగిలినా ఓ పెద్ద విస్ఫోటనానికి దారితీసే మూలాల్ని క్షుణ్ణంగా పరిశీలించాలి. మన 'విద్య-నైపుణ్యాలు- ఉపాధి అవకాశాల' అభివృద్ధి వలయాన్ని దెబ్బతీసే ఒక లోతైన సంక్షోభం అందులో దాగివుంది. ప్రస్తుతం మన దేశంలో ప్రతిష్ఠాత్మక కోర్సుల్లో చేరుతున్న వారికి కూడా నైపుణ్యాలు ఉండటం లేదు. ఉద్యోగాల్లోకి తీసుకోవటానికి చాలామందికి తగిన నైపుణ్యాలు లేవు. 13.5 లక్షల మంది ఇంజినీరింగ్ పట్టభద్రుల్లో కేవలం 15-20శాతం మందికే ఉద్యోగాలకు తగిన కనీస నైపుణ్యాలున్నాయని అంచనా. ఏళ్ల తరబడి కాలేజీల్లో చదువుకున్నాక, ఒక విలువ లేని డిగ్రీతో యువత బయటకు వస్తున్నారు. వైద్య గ్రాడ్యుయేట్లకు కూడా శిక్షణ అరకొరగా ఉంటోంది. పట్టభద్రుల సంఖ్యతో పొంతన లేకుండా వైద్య పోస్టు గ్రాడ్యుయేట్ సీట్లు అతితక్కువ సంఖ్యలో ఉండటంతో, అందులో చేరగలగటం భగీరథ ప్రయత్నంలా మారుతోంది. ఎలాగోలా మరో ప్రవేశపరీక్షలో నెగ్గి, పోస్టుగ్రాడ్యుయేట్ శిక్షణ తీసుకున్న తర్వాత కూడా, వైద్య వృత్తి ప్రాక్టీస్‌కి తగిన నైపుణ్యాలు, నమ్మకం కోసం పేరొందిన వైద్య నిపుణుల వద్ద కొన్నేళ్లపాటు సహాయకులుగా పనిచేయాల్సి వస్తుంది. ఎంతో విలువైనవిగా భావించే 'స్టెమ్' కోర్సుల పరిస్థితే ఇంత ఇబ్బందికరంగా ఉంటే, ఇతర అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ఏటా చేరే సుమారు 90లక్షల మంది విద్యార్థుల పరిస్థితేమిటో ఊహించుకోవచ్చు. ఉద్యోగ మార్కెట్ ప్రపంచ వ్యాప్తంగా వేగంగా మారిపోతోంది. యూనివర్సిటీ డిగ్రీలు అంతేవేగంగా ప్రాధాన్యాన్ని కోల్పోతున్నాయి. ఈ చదువులోనూ అత్తెసరు ప్రమాణాలుంటే.. ఇక ఆ దుస్థితికి అంతుండదు. కాబట్టి, నైపుణ్యాల అంతరం అనేది మనం తక్షణం దృష్టి సారించాల్సిన అంశం. ఏ ఆధునిక ఆర్థిక వ్యవస్థకయినా అత్యున్నత నైపుణ్యాలున్న టెక్నోక్రాట్లు పరిమిత సంఖ్యలోను, నైపుణ్యాలున్న శ్రామిక ఉద్యోగులు పెద్దసంఖ్యలోను అవసరం. కానీ భారత్‌లో ఆ పిరమిడ్ తలకిందులుగా ఉంది. భారత్‌లో కేవలం 50శాతం ఐ.టి.ఐ సీట్లు భర్తీ అవుతున్నాయి. కొద్దిమంది యువత మాత్రమే ఐ.టి.ఐల్లో చేరుతున్నారు (సుమారు 13.20 లక్షలు). పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ఇంకా తక్కువమంది (సుమారు 6.4 లక్షలు) విద్యార్థులు నమోదు చేసుకుంటున్నారు. ఇంజినీరింగ్‌లో చేరేవారితో (13.54 లక్షలు) పోలిస్తే, వారి సంఖ్య అలా తక్కువగా ఉండటం ఏ అభివృద్ధి చెందిన దేశంలోనూ కనిపించని సరళి. ఈ కోర్సులన్నిటిలోనూ ఎక్కువమంది విద్యార్థులు నిజమైన నైపుణ్యాలు, ఉత్పాదకత లేకుండా కేవలం సర్టిఫికెట్లు, డిగ్రీలు అందుకుంటారు.

# సోదరి మరిడమ్మకు వెంకటేశ్వర స్వామి "చీరా - సారె"...!

## - పెద్దాపురంలో ఆధ్యాత్మిక ఘట్టం





**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం పట్టణంలో బుధవారం ఒక ఆధ్యాత్మిక ఘట్టం కనువిందు చేసింది. సోదరి శ్రీ మరిడమ్మ అమ్మ వారికి సోదరుడు అయిన శ్రీవేంకటేశ్వరుడు "చీరా - సారె" సమర్పించారు. అత్యంత వైభవంగా, భక్తి శ్రద్ధల నడుమ ఈ కార్యక్రమం జరిగింది. అన్న చెల్లెళ్ళ అనుబంధానికి, దైవిక బంధానికి ప్రతీకగా నిలిచే ఈ మహోత్సవంలో తెదేపా జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మకాయల చిన రాజప్ప, తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబు రాజులు పాల్గొన్నారు. ఆలయ కార్యనిర్వాహణ అధికారి కె జగదీశ్వరరావు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మరిడమ్మకి సమర్పించే చీరా – సారెతో పురవీదుల్లో ఊరేగింపు నిర్వహించి మరిడమ్మ ఆలయానికి చేరు కున్నారు. ఈ సందర్బంగా ఆలయ కార్యనిర్వాహణాధికారి, దేవాదాయ సహాయ కమిషనర్ కె విజయలక్ష్మి సారెకు ఎదురెళ్ళి ఘనంగా స్వాగతం పలికారు.

అనంతరం వెంకటేశ్వర ఆలయం నుంచి వచ్చిన సారెను అమ్మవారి వద్ద ఉంచి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నాయకులతో పాటు మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# నల్ల వంతెన-ఎర్ర వంతెన మధ్య రోడ్డుకు మోక్షం

## - ఏళ్ల తరబడి అధ్వానంగా మారిన రహదారి సమస్యకు పరిష్కారం - విధులు మంజూరు చేసిన మంత్రి నారాయణకు ధన్యవాదాలు తెలిపిన ఎంఎల్ఏ ఆనందరావు



**అమలాపురం, (రాజధాని వార్తలు):** కోట్లాది రూపాయలతో నిర్మించినా ఏనాడూ ప్రజలకు ఆ రోడ్డు అక్కరకు రాలేదు. రోడ్డు నిర్మించిన కొన్నాళ్లకే గుంతలతో అధ్వాన్నంగా మారి ప్రజలకు ఉపయోగం లేకుండా పోయేది. ఎన్నిసార్లు రిపేర్లు చేసినా మళ్లీ అదే పరిస్థితి. తమకు ఈ రోడ్డు అవసరం వేయండి మహా ప్రభో అంటూ ప్రజలు గగ్గోలు పెట్టే రోడ్డు అది. అదే అమలాపురం హౌసింగ్ బోర్డు ఎడమ వైపున వున్న కాలువ రోడ్డు (నల్ల వంతెన... ఎర్ర వంతెన రోడ్డు ఆర్‌డిఓ ఆఫీస్ ఎదురుగా). రెండేళ్లు అయినా ఎమ్మెల్యే ఆనందరావు పట్టించుకోవడం లేదంటూ ప్రజల నుండి విమర్శలు వెల్లువెత్తాయి కూడా. మూడుసార్లు ఆయన రిపేర్లు చేయించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. ఇక శాశ్వత పరిష్కారమే మార్గమని తలచిన ఎమ్మెల్యే ఆనందరావు ఆ రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని పలుమార్లు మున్సిపల్ మంత్రి నారాయణ ముందు ఫైల్ పెట్టే అభ్యర్థించారు. ప్రస్తుత ఆర్థిక పరిస్థితులలోనూ తలవంచక తప్పలేదని ఎమ్మెల్యే ఆనందరావు అభ్యర్థన మేరకు రూ. 2.5 కోట్లతో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి మంత్రి నారాయణ నిధులు మంజూరు చేశారు. నిధులు మంజూరు కావడంతో బుధవారం ఎమ్మెల్యే ఆనందరావు కాంట్రాక్టర్, మున్సిపల్ అధికారులను పిలిచి రోడ్డును పరిశీలించారు. ఓఎన్‌జిసి వాహనాలు సైతం ఈ రోడ్డుపై రాకపోకలు సాగిస్తాయని అధికారులు నిరంతర పర్యవేక్షణ చేసి సిమెంట్ రోడ్డు దృఢంగా ఉండేలా నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట అముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు, మున్సిపల్ డిఈ సత్యనారాయణ తదితరులు వున్నారు.

# శ్రీ షిరిడి సాయినాథునికి నృత్య నీరాజనం చేసిన గూడూరు విద్యార్థినులు



**గూడూరు, (రాజధాని వార్తలు):** శ్రీ షిరిడిలోని సాయిబాబా మందిరంలో గూడూరు శ్రీ సాయి నృత్య బృంద అకాడమీ నిర్వహించిన ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమం భక్తి పారవశ్యాన్ని నింపింది. గూడూరుకు చెందిన నాట్యాచారిణి పి.శైలజ కుమారి శిక్షణలో చిన్నారులు భరతనాట్యం, భక్తి నృత్యాలను ప్రదర్శిస్తూ సాయినాథునికి నృత్య నీరాజనం సమర్పించారు. షిరిడి సాయి సంస్థాన్ వారి ఆహ్వానం, సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అకాడమీకి చెందిన విద్యార్థినులు సంప్రదాయ వేషధారణలో ఆహ్లాదకరమైన నృత్య ప్రదర్శనలతో భక్తులను అలరించారు. సాయిబాబాపై భక్తి, భారతీయ సంస్కృతి, సనాతన సంప్రదాయాలను ప్రతిబింబించేలా సాగిన ప్రదర్శనలు సభికులను ఆకట్టుకున్నాయి. చిన్నారుల హావభావాలు, లయబద్ధమైన అడుగులు, భావప్రకటనలకు ప్రేక్షకులు కరతాళధ్వనులతో అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నాట్యా చారిణి పి.శైలజ కుమారి మాట్లాడుతూ, షిరిడి వంటి పవిత్ర క్షేత్రంలో తమ అకాడమీ విద్యార్థులకు ప్రదర్శన చేసే అవకాశం రావడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు. చిన్నారుల్లో కళాప్రతిభను ప్రోత్సహిస్తూ, భరతనాట్యం ద్వారా భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మిక విలువలను భావితరాలకు చేరవేయడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఇంతటి గొప్ప అవకాశాన్ని కల్పించిన షిరిడి సాయి సంస్థాన్ పాలకవర్గం, అధికారులకు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సాయినాథుని ఆశీస్సులతో విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందేలా మరింత కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమం అనంతరం పాల్గొన్న చిన్నారులకు జ్ఞాపికలను అందజేసి సత్కరించారు.

# తల్లి పాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం





**అల్లవరం, (రాజధాని వార్తలు):** తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసిడి ఎస్ సిడిపిఓ వై రమాదేవి అన్నారు. తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాల్లో భాగంగా అల్లవరం మండలం కొమరగిరిపట్నం మిలటరీ కాలనీలోని 83వ అంగనవాడి సెంటర్‌లో తల్లిపాల ఆవశ్యకతపై తల్లులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి సిడిపిఓ రమాదేవి హాజరై మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు తల్లిపాలు ఇవ్వడం చాలా శ్రేష్టకరమైనదని బిడ్డ ఆరోగ్యంగా ఉండేందుకు తల్లిపాలు దోహదపడతాయన్నారు. బిడ్డకు పాలు ఇవ్వడంపై కొందరి తల్లుల్లో అపోహలు ఉన్నాయని అవి విడనాడాలని ఆమె సూచించారు. అనంతరం గర్భిణీలకు శ్రీమంతం కార్యక్రమం నిర్వహించారు. వారికి అవసరమైన పోషక పదార్థాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ కె వీ ఎల్ డీ కుమారి, అంగన్వాడి కార్యకర్తలు, ఆరోగ్యశాఖ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మధ్యవర్తిత్వంతో వేగవంతమైన పరిష్కారం...!




**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** మధ్యవర్తిత్వం ద్వారా వివాదాలకు వేగవంతమైన పరిష్కారం లభిస్తుందని పెద్దాపురం ఏడవ అదనపు జిల్లా జడ్జి ఎన్ సరస్వతి అన్నారు. పెద్దాపురం కోర్టు ప్రాంగణంలో ఒక్క కిలోమీటర్ వాక్, బైక్ ర్యాలీ హైకోర్టు, జిల్లా కోర్టుల ఆదేశానుసారం బుధవారం నిర్వహించారు. పెద్దాపురం 7వ అదనపు జిల్లా జడ్జి సరస్వతి ఆధ్వర్యంలో "మధ్యవర్తిత్వం (మీడియేషన్) 3.0" వారోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఈరోజు పెద్దాపురం కోర్టు ఆవరణ నుండి 1కె వాక్, బైక్ ర్యాలీ కొనసాగింది. ఈ ర్యాలీలో పాల్గొన్న సభ్యులందరూ "ప్రజలు లిటిగేషన్ వదిలి మధ్యవర్తిత్వాన్ని అనుసరించాలని", "రాజీ మార్గమే రాజమార్గము" అనే నినాదాలతో అవగాహన కల్పించారు. ఈ సందర్బంగా న్యాయమూర్తి సరస్వతి మాట్లాడుతూ ప్రత్యామ్నాయ వివాద పరిష్కార మార్గాలలో మధ్యవర్తిత్వం (మీడియేషన్) అనేది అత్యంత ప్రధానమైనదన్నారు. దీని ద్వారా వివాదాలను పరిష్కరించుకోవడం వల్ల సమయం ఆదా అవ్వడమే కాకుండా తక్కువ ఖర్చు, సామరస్య పూర్వకమైన వాతావరణం, గోప్యత, అనుకూలత లభిస్తాయన్నారు. కక్షిదారులందరూ ఈ మధ్యవర్తిత్వ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె.దీప దైవ కృప (సీనియర్ సివిల్ జడ్జి), ఎల్ దేవిరత్న కుమారి (ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి), కె.శ్రీహరి (అదనపు జూనియర్ సివిల్ జడ్జి) టి సత్యనారాయణ (బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్)తో పాటు పలువురు న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు, కోర్టు సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రైల్వే ఉద్యోగులు రాజభాషను ఉపయోగించాలి




**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సామర్లకోట రైల్వే స్టేషన్లో స్టేషన్ మేనేజర్ ఎం రమేష్ ఆధ్వర్యంలో రాజభాష (హిందీ) సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి విజయవాడ నుండి ప్రధాన రాజభాష అధికారి హేమంత్ వాడే కర్ విచ్చేసి పాల్గొన్నారు. ఈ సమావేశంలో మాతృ భాషతో పాటు హిందీని కూడా ఉపయోగించాలని, హిందీలో మాట్లాడటం, అధికారిక ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపేటప్పుడు రాజ భాషను కూడా ఉప యోగించాలని తెలియజేశారు.

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులందరూ రాజ భాషకు ప్రాధాన్యతను ఇవ్వాలని ఈ సమావేశంలో కోరారు. ఈ కార్యక్రమానికి హెల్త్ ఇన్స్పెక్టర్ కళ్యాణి, సీనియర్ సెక్షన్ ఇంజనీర్ (వర్క్స్) రత్నాకర్ చందు, డిప్యూటీ సిటీఐ చైతన్య, ఆర్పీఎఫ్ సీఐ మధు, చీఫ్ బుకింగ్ సూపర్వైజర్ ప్రకాష్, చీఫ్ రిజర్వేషన్ సూపర్వైజర్ రాజు, చీఫ్ గూడ్స్ సూపర్వైజర్ దుర్గారావు, సీనియర్ సెక్షన్ ఇంజనీర్ (టెలికామ్) రామక్రిష్ణ, సీనియర్ సెక్షన్ ఇంజనీర్ మోహన్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# అమ్మ భగవాన్‌చే సామూహిక సీమంతాలు



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** పరంజ్యోతి అమ్మ భగవాన్ సేవా సంస్థ ఆద్వర్యంలో సామర్లకోట ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే గర్భిణీలకు సీమంతాల కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. గర్భిణీలకు పసుపు, కుంకుమ, గాజులు, చీర వంటి వస్తువులను గర్భిణీలకు అందచేసి వారికి పోషకాహారం అందచేశారు. ఈ సందర్భంగా సేవా సంస్థ సభ్యులు మాట్లాడుతూ పుట్టే పిల్లలు మంచిగా ఆనందకరమైన భవిష్యత్తుతో ఉండాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో రమణ మూర్తి, కంచర్ల సత్యానందం, అనిత, విజయ లక్ష్మి. శ్రీలక్ష్మీ, పాలూరు వాణి, కాపుగంటి వాణి, రత్నమాల, ధనలక్ష్మీ, ఆసుపత్రి వైద్యులు పాల్గొన్నారు.

# కుటుంబంతో రష్మిక..ఎన్ని కోట్లు సంపాదించినా రాని సంతోషం!



టాలీవుడ్ నుంచి బాలీవుడ్ వరకు స్టార్ హీరోయిన్‌గా వెలిగిపోతున్న రష్మికా మందన్నా సినిమాలకు బ్రేక్ ఇచ్చి కుటుంబంతో సమయం గడుపుతున్నారు. నిరంతరం షూటింగ్‌లు, విమాన ప్రయాణాలు, బిజీ షెడ్యూళ్లతో తీరికలేకుండా గడిపే నేషనల్ క్రష్‌కు చిన్నపాటి గాయం..అనారోగ్యం కారణంగా విరామం దొరికింది. కెరీర్ పరంగా ఎంతో బిజీగా ఉన్న ఈ భామకు ఆరోగ్య సమస్య ఒకరకంగా తన కుటుంబంతో కలిసి ఉండే సువర్ణావకాశాన్ని తెచ్చిపెట్టింది. వ్యాపారాలు, కోట్ల రూపాయల పారితోషికాలు, స్టార్‌డమ్ ఎంత ఉన్నప్పటికీ కుటుంబంతో గడిపే ఆనందం ముందు అవేవీ సరిపోవని రష్మిక అనుభూతి చెందుతున్నారు. ఉరుకులు పరుగుల జీవితంలో కుటుంబ సభ్యులకు దూరం అయిన అమ్మడు ఇప్పుడు పూర్తిగా ఇంటి పట్టునే ఉంటూ ఆనందంగా గడుపుతున్నారు. ఎంత సంపాదించినా దొరకని మానసిక ప్రశాంతత కుటుంబంతో గడిపే క్షణాల వల్లే సాధ్యమవుతుందని ఈ విరామం ద్వారా రష్మిక తెలుసుకుంటున్నారు. షూటింగ్ సెట్స్, కెమెరాలు, లైట్ల హడావుడికి దూరంగా ఇంట్లో కుటుంబ సభ్యులతో గడుపుతున్న క్షణాలు తనకు ఎంతో ఊరటనిస్తున్నాయని సన్నిహితులు చెబుతున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ అమ్మ చేతి వంటలను ఆస్వాదిస్తూ ప్రియమైన వాళ్లతో నవ్వుతూ గడుపుతున్న రోజులు రష్మికకు కోట్ల విలువైన సంపదలా కనిపిస్తున్నాయి. నిత్యం ఒత్తిడితో కూడుకున్న సినీ జీవితానికి ఇది అద్భుతమైన విరామమని చెప్పకనే చెబుతుంది. అనారోగ్యం కారణంగా విశ్రాంతి తీసుకోవాల్సి రావడం బాధాకరమే అయినా? అదే సమయంలో తనకు ఇష్టమైన కుటుంబంతో గడపడానికి సమయం దొరకడం సానుకూల పరిణామంగా భావిస్తున్నారు. కెరీర్ ప్రారంభం నుండి ఇప్పటి వరకు ఎక్కడా ఆగకుండా వరుస చిత్రాలతో దూసుకెళ్తున్న రష్మికకు ఈ విశ్రాంతి శారీరకంగానే కాకుండా మానసికంగా కూడా ఎంతో అవసరమైంది. ఆరోగ్యాన్ని మించిన సంపద లేదనే సత్యాన్ని ఈ సంఘటన మరోసారి నిరూపిస్తుంది. చిన్న విరామం ద్వారా రష్మిక తనలోని సృజనాత్మకతను పునరుద్ధరించుకోవడంతో పాటు, అప్ కమింగ్ ప్రాజెక్ట్‌ల కోసం కొత్త శక్తిని కూడగట్టుకుంటున్నారు. సినిమా పరిశ్రమలో ఎంతటి ఉన్నత స్థానంలో ఉన్నా వ్యక్తిగత జీవితానికి, కుటుంబానికి ఇవ్వాల్సిన ప్రాధాన్యతను ఈ అనుభవం ఆమెకు మరింత స్పష్టం చేస్తుంది. అభిమానులు సైతం తమ అభిమాన నటి త్వరగా కోలుకోవాలని కోరుకుంటూనే.. కుటుంబంతో ఆనందంగా గడుపుతుండటం పట్ల సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం దొరికిన ఈ ప్రశాంతమైన సమయం రష్మికకు కొత్త ఉత్సాహాన్ని ఇవ్వడమే కాకుండా జీవితంలోని అసలైన విలువలను మరోసారి గుర్తు చేస్తుంది.

విరామం ముగిసిన తర్వాత రష్మిక మరింత ఉత్సాహంతో రెట్టింపు శక్తితో రంగుల ప్రపంచంలోకి అడుగుపెడుతుంది. సంపాదన, కీర్తి కంటే ఆప్యాయతలు, అనుబంధాలే మనిషికి అసలైన బలాన్ని ఇస్తాయనేదానికి రష్మిక జీవితంలోని ఈ ఘట్టం చక్కటి ఉదాహరణగా నిలుస్తోంది.

# దీపికా పదుకొణే మళ్లీ టచ్ లోకి వచ్చేది ఎప్పుడంటే?



బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె మరో సుందరమైన ఘట్టానికి సిద్ధమవుతున్నారు. ఇటీవలే ఆమె రెండవ సారి గర్భం దాల్చిన సంగతి తెలిసిందే. ఇప్పటికే ఆ విషయం బయటకొచ్చి రెండు మూడు నెలలు అవుతుంది. దీంతో దీపిక సినిమాలకు పూర్తిగా విరామం ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో దీపిక వృత్తిగత బాధ్యతలను పూర్తి చేసుకుంటూ విశ్రాంతి దిశగా అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే బాలీవుడ్‌లో కింగ్ సినిమా షూటింగ్‌ను దీపికా సకాలంలో పూర్తి చేశారు. ప్రస్తుతం అల్లు అర్జున్‌తో నటిస్తోన్న భారీ బడ్జెట్ చిత్రం రాకా షూటింగ్ షెడ్యూల్‌ను కూడా త్వరలోనే ముగించనున్నారు. ఈ సినిమాకు సంబంధించి కీలక భాగాలను పూర్తి చేసే పనులపై ప్రత్యేక దృష్టి పెట్టారు. రాకా షూటింగ్ పూర్తయిన వెంటనే అమ్మడు పూర్తిగా ఇంటికే పరిమితం కానున్నారు. దీంతో ఈ ఏడాది మిగిలిన కాలం ...వచ్చే ఏడాది ప్రారంభంలో దీపికా పదుకొణె కెరీర్ పరంగా ఎలాంటి కొత్త షూటింగ్స్‌లోనూ పాల్గొనే అవకాశం లేదు. ఆమె పూర్తిగా ఆరోగ్యం, మాతృత్వ విరామం, కుటుంబానికి మాత్రమే సమయం కేటాయించనున్నారు. దీపికా పదుకొణె మళ్లీ పూర్తి స్థాయిలో వెండితెరకు ..మీడియా ముందుకు టచ్‌లోకి వచ్చేది 2027వ సంవత్సరంలోనేనని తెలుస్తోంది. అయితే ఈ గ్యాప్‌లో కింగ్ సినిమా రిలీజ్ డేట్ వస్తే ఆ చిత్రానికి సంబంధించిన ప్రమోషన్స్‌లో పాల్గొనే అవకాశం ఉంది. గర్భిణీగా ఉండి ప్రచారంలో పాల్గొనడం పరిపాటే. కల్కి రిలీజ్ సమయంలో కూడా గర్భంతోనే ముంబైలో మీడియా మీట్‌కు దీపిక హాజరైన సంగతి తెలిసిందే. అంతకు ముందు కరీనా కపూర్, అలిమాభట్, రాణీ ముఖర్జీ లాంటి నటీమణులు కూడా గర్భంతోనే ప్రచార కార్యక్రమాలకు హాజరయ్యారు. కాబట్టి కింగ్ ప్రచారంలో దీపిక తప్పక పాల్గొంటుంది. అలాగని ప్రతీ ఈవెంట్‌కు అటెండ్ అవ్వదు. ఒక్క ఈవెంట్‌కు మాత్రమే పరిమితం కానుందని తెలుస్తోంది. నిరంతరం బిజీ షెడ్యూల్స్, గ్లోబల్ ప్రాజెక్ట్‌లతో క్షణం తీరిక లేకుండా గడిపిన దీపిక మెటర్నిటీ బ్రేక్‌ను వ్యక్తిగత జీవితానికి అత్యంత ప్రశాంతంగా కేటాయించాలని భావిస్తున్నారు. అభిమానులు ఎంతగానో ఇష్టపడే నటి వెండి తెరకు కొద్ది నెలల పాటు దూరంగా ఉండటం ఓవైపు అభిమానులను బాధిస్తున్నా ఆమె ఆరోగ్యమే ప్రధానమని అంతా భావిస్తున్నారు. గ్లామర్ ప్రపంచానికి బ్రేక్ ఇచ్చి మాతృత్వాన్ని ఆస్వాదించబోతున్న దీపికా పదుకొణె 2027లో మరింత ఫ్రెష్‌గా, సరికొత్త ఉత్సాహంతో తిరిగి ప్రేక్షకుల ముందుకు రానున్నారు. అప్పటి వరకు దీపిక రికవరీ ..ఫ్యామిలీ లైఫ్ గురించిన అప్‌డేట్స్ మాత్రమే సోషల్ మీడియాలో ట్రెండ్ అయ్యే అవకాశం ఉంది.

# అట్లీతో అమీర్ ఖాన్ చర్చలు!





బాలీవుడ్ మిస్టర్ పర్‌ఫెక్షనిస్ట్ అమీర్ ఖాన్ సరైన కమర్షియల్ హిట్ కోసం తీవ్రంగా ఎదురు చూస్తున్న సంగతి తెలిసిందే. వరుస సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నా బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయి విజయాలను అందుకోలేకపోతున్నాయి. ఈ నేపథ్యంలో అమీర్ కెరీర్‌ను మళ్లీ ట్రాక్‌లో పెట్టేందుకు ఓ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌పై దృష్టి సారిస్తున్నట్లు సమాచారం. దీనికోసం టాలీవుడ్, కోలీవుడ్ డైరెక్టర్ల వైపు అడుగులు వేస్తున్నట్లు బాలీవుడ్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. స్టార్ డైరెక్టర్ అట్లీతో అమీర్ ఖాన్ సంప్రదింపులు జరుపుతున్నారనే వార్తలు సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. షారుఖ్ ఖాన్‌కి జవాన్ వంటి సంచలన బ్లాక్‌బస్టర్ అందించిన అట్లీ బాలీవుడ్‌లో మోస్ట్ వాంటెడ్ దర్శకుడిగా కొనసాగుతున్నారు. కమర్షియల్ హంగులతో పాటు బలమైన భావోద్వేగాలను మిళితం చేసి సినిమాలు తీయడంలో సిద్ధహస్తుడైన అట్లీతో కలిసి పని చేయడానికి అమీర్ ఖాన్ ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవలే ఇద్దరి మధ్య స్టోరీ డిస్కషన్ జరిగినట్లు బీటౌన్ మీడియా కోడైకూస్తోంది. అమీర్ ఖాన్ బాడీ లాంగ్వేజ్‌కు తగినట్లుగా మాస్ అండ్ యాక్షన్ ప్యాక్డ్ కథను అట్లీ వినిపించాడనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఒకవేళ ఈ ప్రాజెక్ట్ గనుక కార్యరూపం దాలిస్తే ఇండియన్ సిల్వర్ స్క్రీన్పై అరుదైన కలయిక అవుతుంది. అమీర్ ఖాన్ కథల ఎంపికలో ఎంతటి కఠినంగా ఉంటారో తెలిసిందే. స్క్రిప్ట్ విషయంలో ప్రతీ చిన్న అంశాన్ని బేరీజు వేసుకుంటారు. ప్రస్తుతానికి అట్లీ చెప్పిన లైన్ పట్ల సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తోంది. ఇద్దరి మధ్య జరుగుతున్న చర్చలు కొలిక్కి వస్తే దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంటుంది. అయితే అందుకు చాలా సమయం పడుతుంది. బహుశా అధికారిక ప్రకటన వచ్చే ఏడాది వరకూ వచ్చే అవకాశం లేదు. ప్రస్తుతం అట్లీ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా రాకా అనే భారీ చిత్రాన్ని తెరకెక్కిస్తోన్న సంగతి తెలిసిందే. వందల కోట్ల వ్యయంతో నిర్మితమవుతున్న చిత్రమిది.

దీంతో అట్లీ ఎంతో ఏకాగ్రతతో పని చేస్తున్నారు. ఈ సినిమా వచ్చే ఏడాది డిసెంబర్ లో రిలీజ్ అవుతుంది. అంటే అప్పటి వరకూ అట్లీ ఈ సినిమాపైనే బిజీగా ఉంటాడు. కానీ షూటింగ్ అంతా ఓ కొలిక్కి వస్తే గనుక తదుపరి చిత్రాల లైనప్ మాత్రం లీక్ అవుతుంది. ఈ క్రమంలోనే అమీర్ ఖాన్ ప్రాజెక్ట్ వివరాలు కూడా లీకైనట్లు కనిపిస్తోంది. వాస్తవానికి అమీర్ ఖాన్ రాజమౌళి దర్శకత్వంలో సినిమా చేయాలనుకున్నారు. కానీ రాజమౌళి టాలీవుడ్ హీరోలకే కట్టుబడి ఉండటంతో సాధ్యపడలేదు. అయినా ఏదో రోజు కచ్చితంగా అమీర్ - రాజమౌళి కాంబినేషన్‌లో ఓ సినిమా ఉంటుంది.

# అక్కడ ఇక్కడ గాడ్జిల్లాతో రాముడి ఫైట్..!





దేశవ్యాప్తంగా సినీ ప్రేమికులు, అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న మూవీ 'రామాయణ'. ఈ సినిమా నుంచి విడుదలైన ట్రైలర్ అందరి దృష్టిని ఆకర్షించింది. కొందరు ట్రోల్స్ చేస్తున్నప్పటికీ సినిమాకు ఉన్న బజ్ ను పెంచింది అనడంలో సందేహం లేదు. దీపావళి కానుకగా నవంబర్ 6, 2026న విడుదల కాబోతున్న ఈ సినిమాలో రాముడి పాత్రలో రణ్‌బీర్ కపూర్, సీత పాత్రలో సాయి పల్లవి, రావణుడి పాత్రలో కన్నడ స్టార్ యశ్ నటించారు. మొదటి పార్ట్ రామాయణ విడుదల నేపథ్యంలో మేకర్స్ పెద్ద ఎత్తున పబ్లిసిటీ చేస్తున్నారు. రామాయణకు ఉన్న బజ్ నేపథ్యంలో సినిమాను ఇంగ్లీష్‌లోనూ విడుదల చేయాలని నిర్ణయించుకున్నారు. అందుకు తగ్గట్లుగా ఇటీవల సినిమా యొక్క ఇంగ్లీష్ ట్రైలర్‌ను విడుదల చేయడం జరిగింది. హాలీవుడ్ ప్రేక్షకులు సైతం రామాయణ సినిమాపై ఆసక్తి కనబర్చుతున్నారు అనేందుకు ఇంగ్లీష్ ట్రైలర్ వ్యూస్ నిదర్శనం అనేది చాలా మంది అభిప్రాయం.

**రణ్‌బీర్ కపూర్ రామాయణ సినిమాలో...**

ఇండియాలో నవంబర్ 6న విడుదల కాబోతున్న 'రామాయణ' సినిమాకు చిన్నా పెద్దా ఏ ఒక్క సినిమా పోటీగా నిలిచే అవకాశం లేదు. ప్రస్తుతానికి ఆ రోజు పూర్తిగా రామాయణ సినిమాకు రాసి పెట్టినట్లుగానే పరిస్థితి ఉందని విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కానీ అసలు విషయం ఏంటంటే ఆ రోజే హాలీవుడ్ సూపర్ హిట్ మూవీ గాడ్జిల్లా మైనస్ వన్ సినిమాకు సీక్వెల్‌గా రూపొందిన 'గాడ్జిల్లా మైనస్ జీరో' సినిమా విడుదల కాబోతుంది. ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమాకి బజ్ ఉంది. సాధారణంగానే గాడ్జిల్లా బ్యాక్‌డ్రాప్ సినిమాలకు మంచి ఆధరణ ఉంటుంది. అలాంటిది ఈ సినిమా సూపర్ హిట్ సినిమాకు సీక్వెల్ కావడంతో అచనాలు ఆకాశాన్ని తాకేలా ఉన్నాయి. అంతర్జాతీయ స్థాయి అవార్డులు అందుకున్న సాంకేతిక నిపుణులు, నటీనటులు ఈ సినిమాలో నటించిన కారణంగా ఈ సినిమా భారీ ఓపెనింగ్స్ దక్కించుకోబోతుంది.

**హాలీవుడ్ మూవీ గాడ్జిల్లా మైనస్ జీరో...**

ఐమాక్స్ వర్షన్‌లో రూపొందిన గాడ్జిల్లా మైనస్ జీరో సినిమాను సెప్టెంబర్ 26న 64వ న్యూయార్క్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శించబోతున్నారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి అయ్యాయి. ఫిల్మ్ ఫెస్టివల్‌లో సినిమా స్క్రీనింగ్ తర్వాత పెద్ద ఎత్తున ప్రచారం చేసేందుకు గాను మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఇండియాలోనూ ఈ సినిమాను భారీ ఎత్తున విడుదల చేయాలనే చర్చలు జరుగుతున్నాయి. కోట్ల రూపాయల మార్కెట్‌పై గాడ్జిల్లా మైనస్ జీరో మేకర్స్ దృష్టి పెట్టారు అనేది బాక్సాఫీస్ వర్గాల అభిప్రాయం. ఆ సినిమాకు ఉన్న బజ్ నేపథ్యంలో మినిమం థియేటర్లను కేటాయించాల్సిన అవసరం ఉంటుంది. అదే జరిగితే రామాయణ సినిమాకు థియేటర్లు తగ్గడంతో పాటు ఓపెనింగ్స్ సైతం తగ్గుతాయనే అభిప్రాయంను బాక్సాఫీస్ వర్గాల వారు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

**రామాయణ వర్సెస్ గాడ్జిల్లా మూవీ...**

హాలీవుడ్ ప్రేక్షకుల ముందుకు రామాయణ సినిమాను తీసుకు వెళ్లాలి అనుకున్న మేకర్స్‌కి గాడ్జిల్లా కారణంగా అవరోధం ఏర్పడే అవకాశాలు లేక పోలేదు. అక్కడ సైతం ఆ సినిమాను ఎదుర్కొని థియేటర్లను దక్కించుకోవడం చాలా పెద్ద విషయంగా మాట్లాడుకుంటున్నారు. దాంతో ఓవర్సీస్‌తో పాటు ఇండియాలోనూ గాడ్జిల్లా సినిమా కారణంగా రామాయణ సినిమాకు పెద్ద ఇబ్బంది తప్పదు అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. రామాయణ సినిమా విడుదల తేదీ చివరి నిమిషంలో మార్చే అవకాశాలు ఉన్నాయని కొందరు అంటున్నారు.

కానీ మేకర్స్ మాత్రం ఇప్పటికే విడుదలకు సిద్ధంగా ఉన్న కారణంగా చివరి నిమిషం వాయిదా ఉండదని బల్లగుద్ది మరీ చెబుతున్నారు. దాంతో గాడ్జిల్లా వర్సెస్ రామాయణ పోరు తప్పక పోవచ్చు అనేది విశ్లేషకుల అభిప్రాయం.

# ముచ్చర్లలో సెక్టార్ స్థాయి తల్లి పాల వారోత్సవాలు

## - ఐసిడిఎస్ పర్యవేక్షకురాలు జానకి





**గజపతినగరం, (రాజధాని వార్తలు):** మండలంలోని ముచ్చర్ల గ్రామంలో బుధవారం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో సెక్టార్ స్థాయి తల్లి పాలు వారోత్సవాలు నిర్వహించారు. ఐసిడిఎస్ పర్యవేక్షకురాలు జానకి ఆధ్వర్యంలో ఎస్.లింగాలవలస సెక్టార్ పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలు తల్లి పాల ప్రాముఖ్యతను వివరించారు. తల్లి పాలు శిశువుకు అమృతం అని, సంజీవని భలే పని చేస్తాయని వారు అన్నారు. పోషక విలువలతో కూడిన స్టాల్‌ను ఏర్పాటు చేశారు. అనంతరం గ్రామంలో అంగన్వాడీలు అవగాహన ర్యాలీ చేశారు. నలుగురు గర్భిణీలకు సామూహిక సీమంతాలు చేశారు. అన్నప్రాసన కార్యక్రమం కూడా చేశారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ నాయకురాలు సుభాషిణి, 21 మంది అంగన్వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# మక్కువ మండలంలో ఘనంగా తల్లి పాల వారోత్సవాలు



**మక్కువ, (రాజధాని వార్తలు):** మండలంలో కవిరిపల్లి, మక్కువ, మార్కొండ పుట్టి, వెంకట బైరిపురం అంగన్వాడీల పరిధిలో తల్లి పాలు వారోత్సవాలు కార్యక్రమం బుధవారం నాడు ఘనంగా నిర్వహించారు. అంగన్వాడీ, ఎంఎల్‌హెచ్‌పి మార్కొండ పుట్టి, ఎంఎస్‌కె కవిరిపల్లి, ఏఎన్ఎం, ఆశా వర్కర్లతో కలిసి అవగాహన కార్యక్ర మాలు, ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిడిపిఓ అనంతలక్ష్మి మాట్లాడుతూ తల్లిపాలు ప్రాము ఖ్యతను తెలియ చేయడం జరిగింది. పుట్టిన గంటలోపల ప్రతి బిడ్డకు వెంటనే ముర్రుపాలు అందించడం వల్ల రోగనిరోధక శక్తి, సంపూర్ణ పోషణ లభిస్తుందన్నారు. పిల్లలకు తల్లిపాలు అమృతంతో సమాన మని వివరించారు. 6 నెలలు వరకు శిశువులకు తల్లిపాలు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. బిడ్డకు 7 నెలలు నుండి 2 సంవ త్సరాల వరకు అనుబంధ పోషకహారంతో పాటు తల్లిపాలు కొనసాగించాలి. దీంతో బిడ్డకు పోషకాహారం, మానసిక వికాసం, ఊబకాయం, డయాబెటీస్ వంటి దీర్ఘకాలిక వ్యాధులు రాకుండా ఉంటాయన్నారు. అదనపు ఆహారంతో పాటుగా 2 ఏళ్ల వరకు తల్లిపాలు పిల్లలకు ఇవ్వడం అవసరమన్నారు. తల్లిపాలు వలన బిడ్డకు ప్రోటీన్లు, విటమిన్లు, మినరల్స్, శక్తికి కావలసిన పోషకాలు ఉంటాయి. ఇది తల్లికి బ్రెస్ట్ కాన్సర్ రాకుండా, కుటుంబ నియంత్రణ సాధనంగా ఉపయోగపడుతుంది. విధులకు వెళ్లే వారు కూడా 6 గంటల పాటు తల్లి పాలు తీసుకుని పెట్టవచ్చన్నారు. ఆధునిక ఫ్యాషన్లతో తల్లిపాలకు పిల్లలను దూరం చేయొద్దన్నారు. గర్భిణీకి సీమంతం మరియు 7 నెలలు నిండిన పాపకి అన్నప్రాసన చెయ్యడం జరిగింది. హెల్దీ బేబీలకు టాటా టస్ట్ నుండి బహుమతిలు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాచిపెంట ప్రాజెక్ట్ ఐసిడిస్ సీడీపీఓ బి.అనంతలక్ష్మి, సూపర్‌వైజర్ బి.విజయలక్ష్మి, పి.రాజశ్రీ, టి. రవణమ్మ , పాచిపెంట టాటా ట్రస్ట్ ప్రోగ్రాం అసోసియేట్ ఎం. విజయ్ కుమార్, అంగన్వాడీ కార్యకర్తలు, బాలింతలు, గర్భిణీలు, కమ్యూనిటీ సభ్యులు, టిహెచ్ఆర్ తల్లులు, ప్రీ స్కూల్ తల్లులు హాజరయ్యారు.

# సహా దరఖాస్తుదారులను వేధిస్తున్న జ్యోతిపై చర్యలు తీసుకోవాలి

## - సమాచార హక్కు దరఖాస్తు దారుడు మునీంద్ర రెడ్డి డిమాండ్

**చిల్లకూరు, (రాజధాని వార్తలు):** చిల్లకూరు తహసీల్దార్ కార్యాలయంకు ఎవ్వరు ఎన్ని దరఖాస్తులు సమాచార చట్టం ద్వారా సమాచారం ఆ కార్యాలయంలో అడిగిన నేను ఇవ్వను ఏమి చేసుకొంటారు పోండి అని ఆ కార్యాలయం సమాచార అధికారి జ్యోతి నిర్లక్ష్యంగా మాట్లాడుతూ వ్రాతపూర్వకంగా సమాచారం ఇస్తుందనీ సహా దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గూడూరు పట్టణానికి చెందిన నాను మునీంద్ర రెడ్డి చిల్లకూరు తహసీల్దార్ కార్యాలయం 24 మార్చి 2026న రెండు స.హా దరఖాస్తులు కడివెడు రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 805, 876 లకు సంబంధించిన సమాచారం అడిగినా వాటిపై సమాచారం రాకపోవడంతో మొదటి అప్పీల్ గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయంకు చేయడం జరిగిందన్నారు. గూడూరు పలువురు ఆర్డీఓలు పలుమార్లు విచారించి ఆగస్టు 1వ తేదీ ఆర్డీఓ అరుణ కుమారి స.హా దరఖాస్తు దారుడు నాను మునీంద్ర రెడ్డి కోరిన సమాచారం ఇవ్వాలనీ ఆదేశించారు. వారి ఆదేశాల మేరకు చిల్లకూరు తాసిల్దార్ కార్యాలయం పరిధిలో ఉన్న కడివెడు వీఆర్ఓ శీనయ్య రికార్డులు తీసుకొని వాటిని జిరాక్సులు తీయిస్తే సహా ధరకాస్తుదారుడు మునీంద్ర రెడ్డి 5వేలు రూపాయలు జిరాక్సు వాళ్లకి చెల్లించడం జరిగింది. ఆ జిరాక్సు కాపీలపై అటిస్టేషన్ చేయాల్సిన సమాచార అధికారి జ్యోతి ఆరోగ్యం బాగాలేదని తప్పించుకొని తిరుగుతుంది అని ఈ విషయంపై తాసిల్దార్ గోపినాథ్‌ను కలిస్తే చూస్తాం చేస్తాం అని కాలయాపన చేస్తున్నారు




అని మునీంద్రరెడ్డి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం చిల్లకూరు తాసిల్దార్ కార్యాలయం అధికా రులు చేస్తున్న వ్యవహారంపై గూడూరు ఆర్డీవో అరుణ కుమారికి మునీంద్ర రెడ్డి పిర్యాదు చేయడం జరిగింది. గతంలో అవినీతి అక్రమాలకు పాల్పడిన జ్యోతి, గోపినాథ్‌లు కీలకమైన మండలానికి అధికారులుగా రావడం బాధాకరమేనని సహా ధరకాస్తుదారులను నిరంతరం వేధిస్తున్న చిల్లకూరు యంఆర్ఓ గోపినాథ్‌పై సమాచార అధికారి జ్యోతిపై జిల్లా కలెక్టర్ కఠిన చర్యలు తీసుకొని సకాలంలో సమాచారం ఇప్పించాలని సహా దరఖాస్తుదారుడు మునీంద్ర రెడ్డి కోరుతున్నారు. ఈ సమావేశంలో జనసేన నాయకులూ చంద్రశేఖర్, నవీన్ రాజు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యలను పరిష్కరించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన బాధ్యత : ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి



**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** శ్రీకాళహస్తిలోని తన క్యాంప్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గ నలుమూలల నుండి వచ్చిన అనేక మంది ప్రజలు తనను నేరుగా కలిసి తమ సమస్యలపై వినతి పత్రాలు (అర్జీలు) సమర్పించారని ఎమ్మెల్యే తెలిపారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత అధికారులతో అక్కడికక్కడే మాట్లాడి తక్షణమే చర్యలు తీసుకోవాలని సంబందిత అధికారులను ఆదేశించామన్నారు. రెవెన్యూ, పింఛన్లు, తాగునీరు, డ్రైనేజీ మరియు ఇతర స్థానిక సమస్యలపై వచ్చిన అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్ కుమార్, పట్టణ టిడిపి అధ్యక్షులు విజయ్ కుమార్, టౌన్ బ్యాంక్ చైర్మన్ ఖాదర్ బాషా, ఆర్‌డిఓ భాను ప్రకాష్ రెడ్డి, తహసీల్దార్ టి.వి.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# జలశక్తి అభియాన్ లక్ష్య సాధనకు కృషి చేయాలి

## - జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి





**విజయనగరం, (రాజధాని వార్తలు):** జిల్లాలో జలశక్తి అభియాన్ పథకం అమలు, వ్యవసాయ రంగాన్ని మరింత అభివృద్ధి చేసే దిశగా పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎస్. రాం సుందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ ఛాంబర్‌లో జిల్లా అధికారులతో బుధవారం తమ ఛాంబర్‌లో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ రంగ పరిస్థితులు, వర్షాధార భూములకు సాగునీరు అందించేందుకు కార్యాచరణ ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. జిల్లాలో జరుగుతున్న జలశక్తి – జలహారతి పనులపై సమీక్షించారు. భూగర్భ జల మట్టాలను మరింతగా పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, నీటి వనరుల పునరుద్ధరణ పనులను వేగవంతం చేయాలని తెలిపారు. అలాగే, ఉద్యాన పంటల సాగు విస్తరణకు తగిన ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

ఈ అంశాలన్నింటిపై స్పష్టమైన విధివిధానాలతో కూడిన సమగ్ర కార్యాచరణ ప్రణాళికను తక్షణమే సిద్ధం చేయాలని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సి.పి.ఓ. పి. బాలాజీ, వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు వి.తారకరామారావు, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎస్.శారదాదేవి, ఇరిగేషన్ ఈ.ఈ. గోవిందరావు, భూగర్భ జల శాఖ డిప్యూటీ డైరెక్టర్ దినకర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణపై అవగాహన కార్యక్రమం



**రేణిగుంట, (రాజధాని వార్తలు):** రేణిగుంట మండల వైద్యాధికారి డాక్టర్ చక్రపాణి ఆదేశాల మేరకు తూకివాకం గ్రామ పంచాయతీ ఎస్.ఆర్.పట్టెడ గ్రామంలో హెల్త్ సూపర్వైజర్ కామరాజు ఆధ్వర్యంలో ప్రధానమంత్రి టిబి ముక్త్ భారత్ అభియాన్ మరియు దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణపై అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు క్షయవ్యాధి లక్షణాలు, ముందస్తు గుర్తింపు, ఉచిత పరీక్షలు, పూర్తి స్థాయి చికిత్స పొందడం వల్ల క్షయవ్యాధిని పూర్తిగా నయం చేసుకో వచ్చని వివరించారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి టిబి ముక్త్ భారత్ అభియాన్ లక్ష్యాలను వివరించి, ప్రతి ఒక్కరూ క్షయవ్యాధి నిర్మూలనకు సహకరించాలని కోరారు. అనంతరం డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా, బోదకాలు, మెదడు వాపు వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణకు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, నీరు నిల్వ ఉండకుండా చూడడం, ప్రతి శుక్రవారాన్ని డ్రై డేగా పాటించడం, నీటి నిల్వగల పాత్రలను వారానికి ఒకసారి ఖాళీ చేసి శుభ్రం చేయడం, పూర్తి చేతుల దుస్తులు ధరించడం, దోమతెరలు ఉపయోగించడం వంటి జాగ్రత్తలను వివరించారు. ఈ అవగాహన కార్యక్రమంలో డెంగ్యూ మరియు దోమల వ్యాధుల ర్యాలీలో సబ్ యూనిట్ అధికారి వెంకటయ్య, హెల్త్ సూపర్వైజర్ కామరాజు, ఎఎన్ఎం పద్మ, ఎమ్ఎల్హెచ్పీ మేఘన, అంగన్వాడీ కార్యకర్త శంకరమ్మ, హెల్పర్, ఆశా కార్యకర్త గీతాంజలి, విద్యార్థులు, ఉపాధ్యాయులు గ్రామ ప్రజలు, చిన్నారులు పాల్గొని ర్యాలీ నిర్వహిస్తూ ఆరోగ్య అవగాహన నినాదాలు చేశారు.

# శ్రీకాళహస్తిలో ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు ఐఎఫ్ టియు రాష్ట్ర కమిటీ సమావేశాలు

**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** శ్రీకాళహస్తిలో ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు ఐఎఫ్‌టియు రాష్ట్ర కమిటీ సమావేశాలు జరుగుతాయని ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాయపనేని హరి కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తి ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో ఆగస్టు 9, 10, 11 తేదీల్లో మొదటిసారి శ్రీకాళహస్తిలో జరుగుతున్న రాష్ట్ర కమిటీ సమావేశాలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఉదయం 10 గంటలకు శ్రీకాళహస్తి మహేష్ కళ్యాణ్ మండపంలో సభ జరుగుతుందని, ఈ సభలో పెద్ద ఎత్తున ఉద్యోగ కార్మికులు అందరూ పాల్గొని ఈ సదస్సు కూడా జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నేడు ఉద్యోగులు, కార్మికులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక ఇబ్బందులకు గురి చేస్తున్న పరిస్థితి మనకు అర్థమైందన్నారు. ముఖ్యంగా అంగన్వాడి వాళ్లకి ఆశ వర్కర్లకి అదేవిధంగా ఇతర స్కీం వర్కర్స్‌కి ఈ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఇప్పటికి అమలు కాలేదన్నారు. అయితే పని భారం మరింత పెద్ద ఎత్తున ఉందని తెలిపారు. అదే విధంగా ఆటో కార్మికులకు సమగ్ర చట్టం కావాలని, అదేవిధంగా మహిళలకు ఇస్తూ ఉన్నట్టు సున్నా వడ్డీకే ఆటో కార్మికులందరికీ ఆర్థిక ప్రయోజనం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ అంశాల పైన ఈ సదస్సులో చర్చించబోతున్నట్టుగా ఆయన తెలిపారు. అందువల్ల ప్రతీ ఒక్కరు విచ్చేసి ఈ సభను జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు ఎస్.జాకీర్, ఐఎఫ్‌టియు రాష్ట్ర నాయకురాలు అంగన్వాడీ సభ్యురాలు శోభ, ఐఎఫ్ టియు నాయకులు మూర్తి, బాల, ముజీబ్, కళ్యాణ్, పండు తదితరులు పాల్గొన్నారు.




# వృద్ధాశ్రమంలో అన్నదానం

**గూడూరు, (రాజధాని వార్తలు):** గూడూరు పట్టణం కటక రాజు వీధిలో ఉన్న శ్రీ సాయిరాం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న వృద్ధాశ్రమంలో వృద్ధులకు గూడూరు రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో రొటేరియన్ డి.దామోదర్ రాజు, శారద దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా వృద్ధులకు శ్రీ సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు కృష్ణంరాజు మాట్లాడుతూ రోటరీ బెస్ట్ క్లబ్ ద్వారా పేద ప్రజలకు విరివిగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, వివాహ మహోత్సవం సందర్భంగా పేదలకు అన్నదానం నిర్వహించడం అభినందనీయమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హరినాథ్ రెడ్డి, వాసు గౌడ్, ధనుంజయ రెడ్డి, శ్రీనివాసులు, కృష్ణ, బలరాం రెడ్డి, శ్రీనివాస రాజు, నరసరావు, తదితరులు పాల్గొన్నారు.



**RAJADHANI CLASSIFIEDS Ad. Call**
**9440662699, rajadhanivartalu.com**

## EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్శిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్శిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- , అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

## HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యంఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

## MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్: 1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

## REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

## NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ చి.రమేష్, మంగళగిరి 0863-999999

## RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

## COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎఫ్ట్రానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి ప్రాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్స్‌పోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699

# ఎయిమ్స్ మంగళగిరిలో ప్రత్యేక బర్న్స్, ప్లాస్టిక్ సర్జరీ విభాగం ప్రారంభం

## - 970 పడకలతో సంస్థ ఇప్పుడు పూర్తిస్థాయిలో కార్యకలాపాలు సాగిస్తోంది









**మంగళగిరి, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్‌లో తృతీయ స్థాయి ఆరోగ్య సంరక్షణ సేవలను బలోపేతం చేయడంలో మరో ప్రధాన మైలురాయిగా నిలుస్తూ, మంగళగిరిలోని ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) ఈ రోజు తన ప్రత్యేక బర్న్స్ & ప్లాస్టిక్ సర్జరీ బ్లాక్‌ను ప్రారంభించింది. ఈ సంస్థ 43 క్లినికల్ మరియు నాన్-క్లినికల్ విభాగాలతో, 970 పడకల పూర్తిస్థాయి తృతీయ స్థాయి సంరక్షణ ఆసుపత్రిగా మారిందని కూడా ప్రకటించింది. ఈ ప్రత్యేక బర్న్స్ & ప్లాస్టిక్ సర్జరీ బ్లాక్‌ను ఎయిమ్స్ మంగళగిరి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ & సీఈఓ ప్రొఫెసర్ (డా.) అహంతేం శాంతా సింగ్, మెడికల్ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ (డా.) రాజశేఖర్ మోహన్; డీన్ (అకాడమిక్స్) ప్రొఫెసర్ (డా.) దేశు రామ మోహన్; మరియు డిప్యూటీ డైరెక్టర్ (అడ్మినిస్ట్రేషన్) కల్నల్ శశికాంత్ తుమ్మల సమక్షంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి అధ్యాపక సభ్యులు, అధికారులు, సిబ్బంది, మరియు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు హాజరయ్యారు. మెరుగైన రోగి సంరక్షణ సౌకర్యాలను వీక్షించేందుకు, విచ్చేసిన మీడియా ప్రతినిధులను కొత్తగా ఏర్పాటు చేసిన బర్న్స్ వార్డ్ మరియు ఆధునీకరించిన ఎమర్జెన్సీ డిపార్ట్‌మెంట్‌లో గైడెడ్ టూర్‌కు కూడా తీసుకువెళ్లారు. సెప్టెంబర్ 2021లో స్థాపించబడిన బర్న్స్ అండ్ ప్లాస్టిక్ సర్జరీ విభాగం, అధునాతన కాలిన గాయాల సంరక్షణ, పునర్నిర్మాణ శస్త్రచికిత్స, మైక్రోసర్జరీ, హ్యాండ్ సర్జరీ, అవయవాల పునఃప్రతిస్థాపన, పరిధీయ నాడీ శస్త్రచికిత్స, క్యాన్సర్ పునర్నిర్మాణం, పుట్టుకతో వచ్చే వైకల్యాల సవరణ, మరియు సౌందర్య శస్త్రచికిత్స సేవలను అందించే ఒక సమగ్ర కేంద్రంగా అభివృద్ధి చెందింది. కొత్తగా ప్రారంభించబడిన బర్న్స్ బ్లాక్, తీవ్రమైన కాలిన గాయాల నిర్వహణ, బహుళ విభాగాల క్లిష్టమైన సంరక్షణ, మరియు సమగ్ర పునరావాసం కోసం ప్రత్యేక సౌకర్యాలను అందించడం ద్వారా, ప్రత్యేకమైన కాలిన గాయాల సంరక్షణను గణనీయంగా బలోపేతం చేస్తుందని భావిస్తున్నారు. పత్రికా సమావేశం సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, ప్రొఫెసర్ (డా.) అహంతేమ్ శాంతా సింగ్, ఎయిమ్స్ మంగళగిరి ఒక పూర్తిస్థాయి తృతీయ స్థాయి సంరక్షణ సంస్థగా తన పరివర్తనను విజయవంతంగా పూర్తి చేసిందని ప్రకటించారు. గత కొన్నేళ్లుగా ఆరోగ్య సంరక్షణ మౌలిక సదుపాయాలు, రోగి సేవలు, వైద్య విద్య, మరియు పరిశోధనలలో సంస్థ సాధించిన వేగవంతమైన విస్తరణకు ఈ విజయం నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. సంస్థ యొక్క వైద్యపరమైన వృద్ధిని వివరిస్తూ, రోజువారీ సగటు ఔట్‌పేషెంట్ హాజరు దాదాపు 4,500 మందికి పెరిగిందని, వారపు రోజులలో ఈ సంఖ్య 5,000 దాటిందని ఆయన తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో, ఎయిమ్స్ మంగళగిరి 10 లక్షలకు పైగా ఔట్‌పేషెంట్ కన్సల్టేషన్‌లను అందించింది, ఇది గత సంవత్సరంతో పోలిస్తే 25 శాతం పెరుగుదలను సూచిస్తుంది. ఇన్‌పేషెంట్ అడ్మిషన్లు కూడా గణనీయమైన వృద్ధిని సాధించాయి, ఇదే కాలంలో 30,000 మందికి పైగా రోగులు చికిత్స పొందారు, ఇది సుమారు 35 శాతం పెరుగుదలను ప్రతిబింబిస్తుంది. సంస్థ తన క్రిటికల్ కేర్ సామర్థ్యాన్ని గణనీయంగా విస్తరించిందని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఇంకా పేర్కొన్నారు. మంజూరైన 50 ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఐసియు) పడకలకు గాను, ఎయిమ్స్ మంగళగిరి 118 ఐసియు పడకలను అందుబాటులోకి తెచ్చింది. అత్యవసర సేవలు కూడా బలోపేతం చేయబడ్డాయి, పడకల సామర్థ్యం 30 నుండి 60కి పెరిగింది, ఇందులో 10 ప్రత్యేక ఎమర్జెన్సీ ఐసియు పడకలు ఉన్నాయి, ఇవి వేగవంతమైన మరియు మరింత సమగ్రమైన అత్యవసర సంరక్షణను అందించడానికి వీలు కల్పిస్తాయి. గత సంవత్సరంలో డయాగ్నస్టిక్ సేవలు గణనీయంగా విస్తరించాయి. ఎక్స్-రే యూనిట్ల సంఖ్య నాలుగు నుండి పదకొండుకు పెరగగా, అల్ట్రాసౌండ్ యంత్రాల సంఖ్య నాలుగు నుండి ఎనిమిదికి రెట్టింపు అయ్యింది. ఈ సంస్థ త్వరలో ఒక అధునాతన 256-స్లైస్ ఐు స్కానర్‌ను కూడా ప్రారంభించనుంది, ఇది రోగ నిర్ధారణ కచ్చితత్వాన్ని మరియు రోగి సంరక్షణను మరింత మెరుగుపరుస్తుంది. సంస్థ చేపట్టిన అనేక రోగి-కేంద్రీకృత కార్యక్రమాలను కూడా ప్రొఫెసర్ సింగ్ ప్రముఖంగా ప్రస్తావించారు. ఔట్‌పేషెంట్లు మరియు వారి సహాయకుల కోసం ప్రత్యేక భోజన సదుపాయంతో పాటు, పూర్తిగా ఆటోమేటెడ్ ఇన్-హౌస్ డైటరీ కిచెన్ మరియు కెఫెటేరియాను కార్యాచరణలోకి తీసుకువచ్చారు. ఏడు జన ఔషధి కౌంటర్లతో సహా 19 కౌంటర్లతో కూడిన ఆధునిక ఫార్మసీ కాంప్లెక్స్ ఆగస్టు నెలాఖరు నాటికి కార్యాచరణలోకి వస్తుందని అంచనా వేస్తున్నారు, ఇది సరసమైన ధరలకు మందులు మరింత సులభంగా లభించేలా చేస్తుంది. రోగుల సౌకర్యాన్ని మరింత పెంచడానికి, ఫార్మసీ కౌంటర్ల వద్ద వేచి ఉండే సమయాన్ని తగ్గించేందుకు, సంస్థ ఎయిమ్స్ మంగళగిరి ఇ-పరమార్ష్ అప్లికేషన్‌తో అనుసంధానించబడిన 'స్కాన్ & పే' డిజిటల్ చెల్లింపు సదుపాయాన్ని ప్రవేశపెట్టింది. మౌలిక సదుపాయాల నిరంతర విస్తరణ మరియు అధునాతన వైద్య సాంకేతిక పరిజ్ఞానాల ద్వారా కార్డియాలజీ, కార్డియోవాస్కులర్ మరియు థొరాసిక్ సర్జరీ, గ్యాస్ట్రోఎంటరాలజీ మరియు ఇతర సూపర్-స్పెషాలిటీ సేవలను బలోపేతం చేయడంపై ఎయిమ్స్ మంగళగిరి ప్రత్యేక దృష్టి సారిస్తోందని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నొక్కి



చెప్పారు. ఆయుర్వేద, హోమియోపతి విభాగాలతో ఇటీవల ఆయుష్ బ్లాక్‌ను ప్రారంభించడం, అర్హులైన లబ్ధిదారులకు నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ సేవలను మరింత సులభంగా అందించేందుకు వీలుగా ఎక్స్-సర్వీస్‌మెన్ కాంట్రిబ్యూటరీ హెల్త్ స్కీమ్ కింద ఈ సంస్థను చేర్చడం వంటి అంశాలను కూడా ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. సంస్థ యొక్క లక్ష్యాన్ని పునరుద్ఘాటిస్తూ, ప్రొఫెసర్ సింగ్ మాట్లాడుతూ, 'ఫేజ్-IV' ఏమ్స్ సంస్థలతో సమానంగా, మంగళగిరి ఏమ్స్ ఇప్పుడు ఒక సమగ్ర తృతీయ స్థాయి వైద్య సేవా కేంద్రంగా పనిచేస్తోందని తెలిపారు. ఇక్కడ 124 మంది ఇంటర్న్‌లు మరియు 906 మంది నర్సింగ్ సిబ్బందితో సహా మొత్తం 1050 మంది వైద్యులు అంకితభావంతో నిరంతరం సేవలందిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ మరియు పొరుగు రాష్ట్రాల ప్రజల ప్రయోజనం కోసం వైద్య విద్య, పరిశోధన మరియు ఆవిష్కరణలను బలోపేతం చేస్తూనే... అందుబాటు ధరలో, రోగి-కేంద్రీకృత మరియు ప్రపంచ స్థాయి వైద్య సేవలను అందించాలనే సంస్థ యొక్క నిబద్ధతను ఆయన మరోసారి స్పష్టం చేశారు.

# వికసిత్ భారత్ వైపు చేనేత అడుగులు



కేవలం సాంకేతికతతోనే అభివృద్ధి చెందిన దేశ నిర్మాణం సాధ్యం కాదు. దాని బలాలను భవిష్యత్ వృద్ధికి చోదక శక్తులుగా మార్చే సామర్థ్యంపై రూపుదిద్దుకుంటుంది. భారతదేశం 'వికసిత భారత్ 2047' దిశగా పురోగమిస్తున్న తరుణంలో, మనం అత్యాధునిక సాంకేతికతలలో పెట్టుబడులు పెడుతున్నాం. తయారీ రంగాన్ని బలోపేతం చేస్తున్నాం. ప్రపంచవ్యాప్తంగా పోటీతత్వ పరిశ్రమలను నిర్మిస్తున్నాం. అయితే, మన గొప్ప బలాలలో ఒకటైన మన చేనేత సంప్రదాయం మనతోనే ఉంది. ఆగస్టు 7న భారతదేశం 12వ జాతీయ చేనేత దినోత్సవాన్ని జరుపుకుంటున్న సందర్భంగా, సుస్థిరతకు, ప్రామాణికతకు మరియు దృఢమైన సరఫరా వ్యవస్థలకు విలువిచ్చే ఈ ప్రపంచం కోసం చేనేతను ఒక వ్యూహాత్మక రంగంగా చూడాల్సిన సమయం ఆసన్నమైంది. మన ప్రధాని నరేంద్ర మోదీ 'వికసిత్ భారత్ 2047' దృక్పథం సమృద్ధి, స్వావలంబన, సమ్మిళితత్వం, సాంస్కృతిక విశ్వాసాలపై నిర్మించబడింది. చేనేత రంగం మన సంప్రదాయాన్ని, కొత్త ఆవిష్కరణలను ఒకచోటకు చేరుస్తుంది. అంతేకాకుండా మహిళల నేతృత్వంలో అభివృద్ధి, గ్రామీణ వ్యవస్థాపకత, జీవనోపాధి మరియు ప్రపంచ స్థాయి పోటీతత్వాన్ని ముందుకు తీసుకెళ్లడం ద్వారా ఈ దృక్పథానికి ప్రతిరూపంగా నిలుస్తుంది.

రామచరిత మానస్లో చెప్పినట్లుగా:

"సౌరజ ధీరజ తెహి రథ చాకా। సత్య సీల దృఢ ధ్వజా పతాకా॥ బల బిబేక దమ పరహిత ఘోరే। ఛమా కృపా సమతా రజు జోరే॥"

విజయ రథం గురించి వివరిస్తూ శ్రీరాముడు, "శాశ్వత విజయం అనేది కేవలం అధికారంతో రాదు, అది నైతిక విలువలపైనే నిర్మించబడుతుంది" అని బోధిస్తాడు. ఆ విలువలనే శతాబ్దాలుగా భారతదేశ చేనేత సంప్రదాయాన్ని నిలబెట్టాయి. ప్రతి చేనేత వస్త్రం వెనుక సంప్రదాయాన్ని కాపాడే ధైర్యం, ప్రతి దారాన్ని సరిగ్గా కుదిర్చే ఓర్పు, ప్రామాణికమైన హస్తకళా నిబద్ధత మరియు తరతరాల జ్ఞానం ప్రతిబింబిస్తాయి. అందుకే చేనేత కేవలం ఒక కళ మాత్రమే కాదు, భారతదేశ నాగరికతకు ఉన్న అత్యంత గొప్ప బలాలలో ఒకటి. మొట్టమొదట పత్తిని సాగు చేసి, నేసిన సింధు లోయ నాగరికత నుంచి, భారతీయ వస్త్రాలు ప్రపంచ వాణిజ్యంలో ఆధిపత్యం చెలాయించిన పద్దెనిమిదవ శతాబ్దం వరకు, భారతదేశం వస్త్ర రంగ నైపుణ్యంలో ప్రపంచ ప్రమాణాలను నెలకొల్పింది. ఒక ఉంగరం గుండా 25 మీటర్ల పొడవునా జాలువారేంత నాజూకైన బెంగాల్ ప్రఖ్యాత మస్లిన్, బనారసి పట్టు, కాంచీపురం నేతలు, పోచంపల్లి ఇక్కత్, లెక్కలేనన్ని ప్రాంతీయ సంప్రదాయాలు కలిసి భారతదేశానికి ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలను సంపాదించిపెట్టాయి. నేడు, ప్రపంచం మళ్లీ ప్రామాణికమైన, సుస్థిరమైన, చేతితో తయారు చేసిన ఉత్పత్తుల వైపు మొగ్గు చూపుతోంది. ఆ నాయకత్వాన్ని మనం మళ్లీ సొంతం చేసుకోవడానికి ఇది ఒక చారిత్రాత్మక అవకాశం. మన తదుపరి చేనేత విప్లవం కేవలం వస్త్రాలను మాత్రమే కాకుండా మన కళను, సంస్కృతిని, నూతన ఆవిష్కరణలను మరియు నమ్మకాన్ని ఎగుమతి చేయాలి; తద్వారా ప్రతి చేనేత ఉత్పత్తిని 'బ్రాండ్ ఇండియా' రాయబారిగా మార్చాలి. చేనేత పరిశ్రమ భారతదేశ అతిపెద్ద కుటీర పరిశ్రమ. ఇది 35 లక్షలకు పైగా నేత కార్మికులు, అనుబంధ కార్మికుల జీవనోపాధికి ఊతమిస్తోంది. వీరిలో దాదాపు 72 శాతం మంది మహిళలే ఉన్నారు. గత దశాబ్ద కాలంలో, ప్రభుత్వం ముడి పదార్థాల సరఫరా పథకం, 797 చేనేత క్లస్టర్లు, 1.24 లక్షలకు పైగా అధునిక మగ్గాలు, దాదాపు 97,000 మంది చేతి వృత్తిదారులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ద్వారా ఈ రంగాన్ని బలోపేతం చేసింది. అలాగే.. ప్రొడ్యూసర్ కంపెనీలు, జీఐ ట్యాగ్ ఉన్న ఉత్పత్తులు, హ్యాండ్లూమ్ మార్క్, ఇండియా హ్యాండ్మేడ్ సర్టిఫికేషన్, అర్బన్ హాట్లు, డిజైన్ రిసోర్స్ సెంటర్ల వంటి కార్యక్రమాలతో ఈ రంగం బలోపేతమైంది. నేడు, 29 నేత కార్మికుల సేవా కేంద్రాలు శిక్షణ, నైపుణ్యాభివృద్ధి, డిజైన్ అభివృద్ధి, ముడి పదార్థాల సహాయం, మార్కెట్ అనుసంధానాల ద్వారా పూర్తిస్థాయి మద్దతును అందిస్తున్నాయి. అలాగే, అధునాతన శిక్షణను అందించేందుకు మరియు ప్రత్యేకమైన, అధిక విలువ కలిగిన చేనేత ఉత్పత్తులను అభివృద్ధికి 11 ఇండియన్ ఇన్స్టిట్యూట్స్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ సంస్థలను బలోపేతం చేస్తున్నారు. ఈ కార్యక్రమాలు చేనేతను ఒక సంక్షేమ కార్యక్రమంగా చూడటం నుంచి ప్రపంచ స్థాయిలో పోటీపడే సృజనాత్మక పరిశ్రమగా మార్చే దిశగా వచ్చిన మార్పును సూచిస్తున్నాయి. రాబోయే జాతీయ చేనేత మరియు హస్తకళల కార్యక్రమం 500కు పైగా జిల్లాల్లోని 1,800 క్లస్టర్లను బలోపేతం చేస్తుంది. ఇది 65 లక్షల మంది నేత కార్మికులకు, చేతివృత్తిదారులకు లబ్ధి చేకూరుస్తుంది. 'హ్యాండ్మేడ్ ఇన్ ఇండియా'ను ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన బ్రాండ్గా నిలబెడుతుంది. భారతదేశ చేనేత ప్రయాణంలో ఆవిష్కరణ ఎల్లప్పుడూ ఒక అంతర్భాగంగా ఉంది. మహాత్మా గాంధీ అంబర్ చరఖా మరింత సమర్థవంతంగా నూలు వడకడాన్ని సులభతరం, వేగవంతం చేసి స్వావలంబన లక్ష్యాన్ని ముందుకు నడిపించింది. ఇటీవలే, అస్సాంలోని మైనా మగ్గం మరియు శివసాగర్లో అభివృద్ధి చేసిన చిత్రరంజన్ చేనేత మగ్గం, మెరుగైన మగ్గం రూపకల్పన నేతను ఎంత సులభతరం, మరింత ఉత్పాదకంగా చేయగలదో చూపించాయి. ఈ వారసత్వాన్ని కొనసాగిస్తూ, ఇండియన్ ఇన్స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ సహకారంతో స్థాపించిన 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ', దివ్యాంగులతో సహా ఇతరుల కోసం శారీరక శ్రమను తగ్గించి, ఉత్పాదకతను మెరుగుపరిచే తేలికైన, బలమైన మరియు ఉపయోగించేందుకు సులభమైన మగ్గాలను అభివృద్ధి చేస్తోంది. ఈ కేంద్రం ఆధ్వర్యంలో, 'హ్యాండ్లూమ్ 4.0' కార్యక్రమం ఉత్పాదకత, నాణ్యత, నిర్వహణ పర్యవేక్షణకు డిజిటల్ సాధనాలు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ను ఉపయోగిస్తుంది. దీనిని రాష్ట్రాల వ్యాప్తంగా విస్తరించే ముందు 100 మగ్గాలతో పైలట్ ప్రాజెక్ట్ను అమలు చేస్తున్నారు. సాంకేతికత చేనేత కార్మికుడికి సాధికారత కల్పించాలి తప్పా, అతని స్థానాన్ని ఆక్రమించకూడదు. విజియో ఎన్ఎక్స్టీ వంటి వేదికలు డిమాండ్ను అంచనా వేయడానికి, డిజైన్ ట్రెండ్లను గుర్తించడానికి, అసలైన చేనేత ఉత్పత్తుల ప్రామాణికతను ధృవీకరించడానికి, నేత కార్మికులను నేరుగా ప్రపంచ మార్కెట్లతో అనుసంధానించేందుకు సహాయపడతాయి. అదే సమయంలో, ప్రీమియం పట్టు, సహజ దారాలు, సుస్థిర నారలు, వినూత్న మిశ్రమాలలోకి ఉత్పత్తులను విస్తరించి అధిక విలువ గల ఉత్పత్తులను సృష్టించి, కొత్త మార్కెట్ల అవకాశాలను అందుకోవచ్చు. మెరుగైన బ్రాండింగ్, విలువ జోడింపు, నేరుగా మార్కెట్ అందుబాటుతో ఈ ఆవిష్కరణలు నేత కార్మికుల ఆదాయాలను పెంచుతాయి. రాబోయే సంవత్సరాల్లో ప్రతి నేత కార్మికుడు నెలకు రూ.50,000 గౌరవప్రదమైన, ఆశాజనకమైన ఆదాయాన్ని పొందేలా చేయడమే మా లక్ష్యం. చేనేత పరిశ్రమ భవిష్యత్తు చాలా వరకు మార్కెట్ల ఆలోచనా విధానంపై ఆధారపడి ఉంటుంది. మన నేత కార్మికులు కేవలం శ్రామికులు మాత్రమే కాదు. వారు పారిశ్రామికవేత్తలు, ఆవిష్కర్తలు, విలువ సృష్టికర్తలు. బ్రాండ్లను నిర్మించుకోవడానికి, విలువ శ్రేణిలో వృద్ధి చెందేందుకు, ప్రపంచ మార్కెట్లను చేరుకోవడానికి వారికి అవకాశం కల్పించి, మనం చేనేతను భారతదేశ అత్యంత చైతన్యవంతమైన సృజనాత్మక పరిశ్రమలలో ఒకటిగా మార్చవచ్చు. నేత తదుపరి అధ్యాయాన్ని తీర్చిదిద్దడానికి వారసత్వాన్ని–సాంకేతికతను, సృజనాత్మకతను–వ్యాపార నైపుణ్యాన్ని కలపాలని భారతీయ యువతకు ఇది ఒక పిలుపు. ఈ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా, మన నేత కార్మికులను మన వారసత్వ సంరక్షకులుగా మాత్రమే కాకుండా, భారత ప్రగతికి రూపశిల్పులుగా కూడా గౌరవిద్దాం. చేనేతను మన దైనందిన జీవితంలో ఒక భాగంగా చేసుకుందాం. మనం కొనే, ధరించే ప్రతి చేనేత వస్తువు ఒక నేత కార్మికుని జీవనోపాధిని బలపరుస్తుంది. సంప్రదాయాన్ని పరిరక్షిస్తుంది. భారతదేశ గాథను ప్రపంచానికి చాటిచెబుతుంది. చేనేతను ఎంచుకోవడం ద్వారా, మనం మన వారసత్వాన్ని ధరించడమే కాదు – వికసిత భారత్ భవిష్యత్తును నేయడంలో సహాయపడతాం.

**గిరిరాజ్ సింగ్**
(రచయిత: కేంద్ర జౌళి శాఖ మంత్రి)
(ఇందులో వ్యక్తపరిచిన అభిప్రాయాలు వ్యక్తిగతమైనవి)

# ఉత్సాహంగా ఇంటింటికి తెలుగుదేశం

ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహంగా సాగుతోంది. ఇందులో పాల్గొన్న పలువురు ప్రజాప్రతినిధులకు గ్రామాల్లో ఘన స్వాగతం లభిస్తోంది. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమంటూ ఎమ్మెల్యేలు ప్రతి గడపకు వెళ్లి వారికి అందిన సంక్షేమ పథకాలను వివరిస్తున్నారు. ఎటువంటి అవినీతికి తావు లేకుండా తమకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఈ సందర్భంగా ప్రజాప్రతినిధుల వద్ద పలువురు లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. ఇళ్లకు వస్తున్న ఎమ్మెల్యేలు, ఎంపీలు, అధికారులకు ప్రజలు వాడవాడనా ఎదురేగి స్వాగతం పలుకుతున్నారు. సంక్షేమాభివృద్ధే లక్ష్యంగా ముందుకు వెళుతున్న తెలుగుదేశం పార్టీకి తమ మద్దతు అంటున్నారు. గ్రామాల్లో పర్యటిస్తున్న ఎమ్మెల్యేలు తమ దృష్టికి వచ్చిన సమస్యలను వెంటనే అక్కడికక్కడే పరిష్కరిస్తున్నారు. ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్న సీఎం చంద్రబాబు నాయుడికి తమ ఆశీస్సులు ఎప్పుడూ ఉంటాయని ప్రజలు దీవిస్తున్నారు. గత తొమ్మిది రోజుల్లో 25లక్షల కుటుంబాలకు ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం చేరడం అరుదైన రికార్డుగా చెప్పవచ్చు. ఈ రికార్డు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకే సాధ్యమని చెప్పాలి. ప్రజలకు ప్రభుత్వ విజయాలను వివరించడంతో పాటు, క్షేత్రస్థాయిలో వారు ఎదురవుతున్న సమస్యలు, ప్రజల సలహాలు మరియు అభిప్రాయాలను తెలుసుకుంటూ చాలా ఉత్సాహంగా ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం కొనసాగుతున్నది. ప్రజాసమస్యలను పార్టీ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించడం ద్వారా మరింతగా పార్టీని ప్రజలకు దగ్గర చేస్తున్నారు.



కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇంటింటికీ తెలుగుదేశం – రెండేళ్ళ నమ్మకం, అభివృద్ధి–సంక్షేమం' కార్యక్రమం ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా చాలా ఉత్సాహంగా సాగుతోంది. బుధవారంతో ఈ ప్రజా చైతన్య యాత్ర తొమ్మిదో రోజుకు చేరుకుంది. ఈ తొమ్మిది రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా కూటమి నాయకులు, కార్యకర్తలు ప్రజల వద్దకు వెళ్లి ప్రభుత్వ పాలనా విజయాలను వివరిస్తున్నారు.

**రికార్డు స్థాయిలో కుటుంబాల సంప్రదింపులు**

ఈ ప్రచారంలో భాగంగా ఇప్పటివరకు దాదాపు 25 లక్షల కుటుంబాలను కూటమి శ్రేణులు నేరుగా కలిశాయి. కేవలం ఒక్క మంగళవారం నాడే రాష్ట్రవ్యాప్తంగా 3.03 లక్షలకు పైగా ఇళ్లను సందర్శించి, రెండేళ్ల కాలంలో సాధించిన ప్రగతిని ప్రజలకు వివరించారు. ముఖ్యంగా ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రధాన హామీలైన 'సూపర్ సిక్స్' పథకాల అమలు తీరును ప్రతి ఇంటికీ చేరవేయడంతో పాటు, ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తూ ప్రజల అభిప్రాయాలను సేకరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీతో పాటు జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు సైతం క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. అధికార పక్షంలోని మూడు పార్టీల శ్రేణులు సమన్వయంతో ముందుకు వెళ్తూ ప్రజల సమస్యలను తెలుసుకుంటూ ముందుకు సాగుతున్నాయి. ప్రభుత్వ సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఈ త్రిసభ్య కూటమి క్షేత్రస్థాయిలో అద్భుతమైన సమన్వయాన్ని ప్రదర్శిస్తోంది.

**క్షేత్రస్థాయిలో అలసత్వానికి తావులేదు**

కార్యక్రమంలో ఎక్కడా ఎలాంటి అలసత్వం ప్రదర్శించకూడదని నారా లోకేశ్ పార్టీ శ్రేణులకు స్పష్టం చేశారు. పార్టీకి చెందిన అన్ని అనుబంధ విభాగాలు మరియు ప్రజాప్రతినిధులు పరస్పర సమన్వయంతో ప్రతి ఇంటి తలుపు తట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి, ప్రజల నమ్మకాన్ని మరింత రెట్టింపు చేయడమే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. ఒకే రాజధాని అభివృద్ధి వికేంద్రీకరణ, ఉత్తరాంధ్ర, రాయలసీమలో జరుగుతున్న అభివృద్ధిని వివరిస్తున్నప్పుడు వైసీపీ పాలనకు,కూటమిప్రభుత్వ అభివృద్ధి పాలనకు మధ్య ఉన్న తేడాను ప్రజలకు స్పష్టంగా తెలియజేసినప్పుడు ప్రజలు ఆసక్తిగా ఆలకించడం విశేషం. ప్రత్యేకంగా సూపర్–6 హామీల అమలు ఈ ప్రచారంలో ప్రధాన అంశంగా నిలుస్తున్నది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, యువతకు ఉపాధి, విద్యార్థులకు విద్యా అవకాశాల విస్తరణ, సామాజిక భద్రత పథకాల వంటి అంశాలను ప్రజలకు తెలియజేస్తున్నప్పుడుకూటమి ప్రభుత్వంపైన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలనపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నా.రు.మరో పదిహేను సంవత్సరాలు కూటమి ప్రభుత్వమే అధికారంలో ఉండాలని ప్రతి ఒక్కరు దీవిస్తున్నారు. ప్రతి వర్గానికి ప్రభుత్వం అందించిన లబ్ధిని ఉదాహరణలతో ప్రజలకు తెలియజేస్తూ అభివృద్ధి అంశాల్లో అమరావతి రాజధాని నిర్మాణం వేగవంతం, పోలవరం ప్రాజెక్టు పురోగతి, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, పెట్టుబడుల ఆకర్షణ, పరిశ్రమల ఏర్పాటు, రోడ్లు, విద్య, వైద్యం, డిజిటల్ సేవల విస్తరణ వంటి అంశాలను కూడా ప్రచారంలో ప్రధానంగా ప్రస్తావిస్తూ తెలుగుదేశం పార్టీ శ్రేణులు ముందుకు సాగుతున్నాయి. మొత్తానికి ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం ఉత్సాహభరితంగా కొనసాగుతోంది. చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వ పాలనకు ఈ కార్యక్రమం అద్దం పడుతోంది.

**వాసంశెట్టి సుభాష్**
కార్మికశాఖమంత్రి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

# నేడు రాష్ట్ర పండుగగా పొన్నమండ లక్ష్మణస్వామి వర్మ జయంతి



**అమరావతి, (రాజధాని వార్తలు):** అగ్ని కుల క్షత్రియుల జాతిపిత పొన్నమండ లక్ష్మణస్వామి వర్మ జయంతిని నేడు (శుక్రవారం) రాష్ట్ర పండుగగా నిర్వహించనున్నట్లు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. పొనమ్మండ లక్ష్మణస్వామివర్మ రాష్ట్ర స్థాయి జయంతిని కాకినాడ జిల్లా కోరింగలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. అగ్నికులక్షత్రియ సామాజిక వర్గం అభివృద్ధికి పొన్నమండ లక్ష్మణ స్వామి విశేష కృషి చేశారన్నారు. తన సామాజిక వర్గంతో పాటు పేదల అభ్యున్నతికి విశేష కృషిన సమాజ సంస్కర్త అని కొనియాడారు. 1890లో కాకినాడ సమీపంలోని కోరంగి గ్రామంలో అగ్నికుల క్షత్రియుల ప్రప్రథమ రాష్ట్రస్థాయి మహాసభను నిర్వహించి, ఆ సామాజిక వర్గీయులను ఒకతాటిపైకి తీసుకొచ్చారన్నారు. ఆయుర్వేద వైద్య రంగంలోనూ పొన్నమండ లక్ష్మణస్వామి వర్మ విశేష సేవలు అందించారన్నారు. 120 రకాల ఔషధాలను తయారు చేసి దేశ విదేశాలకు పంపిణీ చేసిన మహనీయుడని కొనియాడారు. అగ్నికుల క్షత్రియ సమాజానికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావడంలో ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. ఆయన కృషి ఫలితంగానే 1927లో జీవో నెం. 271 ద్వారా అగ్నికుల క్షత్రియులు అనే అధికారిక గుర్తింపు లభించిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయన జయంతిని అధికారిక రాష్ట్ర పండుగగా నిర్వహించాలని నిర్ణయించడం సమాజానికి దక్కిన గొప్ప గౌరవమని పేర్కొన్నారు. భావి తరాలకు పొన్నమండ లక్ష్మణస్వామి వర్మ సేవలు తెలియజేయాలన్న లక్ష్యంతో ఆయన జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నామన్నారు. పొన్నమండ లక్ష్మణస్వామి వర్మ జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహిస్తూ సీఎం చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకోవడంపై మంత్రి సవిత హర్షం వ్యక్తంచేశారు. బీసీల మనోభావాలకు గౌరవమిస్తూ ఆయా వెనుకబడిన వర్గాలకు చెందిన మహనీయుల సేవలను కొనియాడుతూ, వారి జయంతలను రాష్ట్ర పండుగగా నిర్వహిస్తూ వస్తున్నామని మంత్రి సవిత తెలిపారు.

# ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా వేటపాలెంకు చంద్రబాబు రాక





**బాపట్ల జిల్లా, (రాజధాని వార్తలు):** ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా శుక్రవారం వేటపాలెం మండలం, కొత్తపేట గ్రామం నందు నిర్వహించే రాష్ట్ర స్థాయి చేనేత సేవ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొనే ప్రజావేదిక,హెలీప్యాడ్, స్టాల్స్ ఏర్పాట్లును పరిశీలిస్తున్న రాష్ట్ర రెవిన్యూ స్టాంప్స్ రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, రాష్ట్ర చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత, చీరాల నియోజకవర్గం ఎమ్మెల్యే ముద్దలూరి మాల కొండయ్య, జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, వి. జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్, ముఖ్యమంత్రి పర్యటనల సమన్వయకర్త పెందుర్తి వెంకటేశ్వరరావు, బావుడా చైర్మన్ రాజశేఖర్ బాబు తదితరులు పరిశీలించారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan